

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | గురువారం 13-08-2026 | సంపుటి - 31 | సంచిక - 81 | రూ : 4 | పేజీలు: 8


తెలంగాణకు

## 11.56 లక్షల ఇళ్లు కేటాయించండి

- కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను కోరిన మంత్రి పొంగులేటి



దిల్లీ: ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ 2.0 కింద తెలంగాణకు 11,56,915 ఇళ్లను కేటాయించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారమిక్కడ ఆయన కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా 'ఆవాస్ ప్లస్ 2024' యాప్ ద్వారా పారదర్శకంగా ఇంటింటి సర్వే నిర్వహించామని.. ఇందులో 11.56 లక్షలకుపైగా కుటుంబాలు ఇళ్లకు అర్హమైనవిగా తేలిందని కేంద్ర మంత్రికి తెలియజేశారు. ఏడాది క్రితమే అనర్హుల తొలగింపు ప్రక్రియను పూర్తి చేసినప్పటికీ కేంద్రం **తరువాయి 2లో**



ఎన్డీఎస్ఏ సూచనల మేరకే

# మేడిగడ్డ పునరుద్ధరణ

- గూడెందొడ్డి పంప్ స్టోరేజీ ప్రాజెక్టుపై కన్సల్టెన్సీ నియామకం
- ప్రాజెక్టుల పరిహారం.. పునరావాసం వేగవంతం
- గరిష్ట స్థాయిలో గోదావరి జలాల వినియోగం..నీటి పారుదల సమీక్షలో సీఎం

### రేవంత్ రెడ్డి ఆదేశాలు

హైదరాబాద్ : జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) సూచనల మేరకే సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల్లో నీటి నిల్వ చేయడంతో పాటు పునరుద్ధరణ పనులు చేపట్టాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మూడు బ్యారేజీల్లో తేలిన సాంకేతిక లోపాలు, తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు సీఎంకు వివరించిన సందర్భంలో సీఎం మాట్లాడుతూ.. సొంత నిర్ణయాలు తీసుకుకోకుండా నిపుణుల సలహా మేరకే ముందుకెళ్లాలని వారికి సూచించారు. ఎల్లంపల్లితో పాటు దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల నుంచి సాధ్యమైనంత మేరకు ఎత్తిపోతలు చేపట్టాలన్నారు. రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డితో కలిసి నీటి పారుదల శాఖపై బుధవారం **తరువాయి 2లో**

జెన్-జీకి..

## ప్రధాని మోదీ కీలక సూచన



- జీవితంలో షార్ట్‌కట్‌లు ప్రమాదకరమన్న ప్రధాని నరేంద్ర మోదీ
- సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, రీల్స్‌తో జాగ్రత్తగా ఉండాలని సూచన
- గొప్ప వ్యక్తుల జీవిత చరిత్రలు చదవాలంటూ యువతకు హితవు
- మాజీ రాష్ట్రపతి కోవింద్ ఆత్మకథ ఆవిష్కరణ సభలో వ్యాఖ్యలు

ఢిల్లీ, ఆగస్టు 12 : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేటి తరం యువతకు (జెన్‌జీ) పలు కీలక సూచనలు చేశారు. జీవితంలో అడ్డదారుల వెంట పడొద్దని, అవి అంతిమంగా తీవ్ర నష్టాలకే దారితీస్తాయని ఆయన హెచ్చరించారు. అదే సమయంలో, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, రీల్స్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బుధవారం నాడు ఢిల్లీలో మాజీ రాష్ట్రపతి **తరువాయి 2లో**



*రికార్డుల దిశగా చార్‌ధామ్ యాత్ర..*

## 47 లక్షలు దాటిన యాత్రికుల సంఖ్య

- చార్‌ధామ్ యాత్రకు రికార్డు స్థాయిలో తరలివస్తున్న భక్తులు
- ప్రతికూల వాతావరణంలోనూ భక్తుల భద్రతకు అధిక ప్రాధాన్యత
- విపత్తు నిర్వహణ విభాగం అప్రమత్తంగా ఉండాలని సీఎం ఆదేశం
- అన్ని క్షేత్రాల్లోకి బద్రీనాథ్‌కు అత్యధికంగా పోటెత్తిన భక్తులు

ఉత్తరాఖండ్‌లో చార్‌ధామ్ యాత్రకు భక్తులు పోటెత్తుతున్నారు. వర్షాకాలం కారణంగా సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ, యాత్రికుల సంఖ్య రికార్డు స్థాయిలో నమోదవుతోంది. ఈ **తరువాయి 2లో**

చంద్రబాబు ఒక

## *విజనరీ లీడర్*

- నిజమైన అభివృద్ధికి చంద్రబాబు చిరునామా అన్న ద్రౌపది ముర్ము
- ఏపీ అభివృద్ధికి చంద్రబాబు చేస్తున్న కృషి అభినందనీయమని ప్రశంస
- రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళుతున్నారన్న రాష్ట్రపతి



**2లో**

*ఇంటింటికీ*

## *తెలుగుదేశం*

*17 రోజుల్లో 50 లక్షల ఇళ్ల సందర్శన*




'రైల్ వన్' యాప్‌కు విశేష ఆదరణ..

## 4.76 కోట్లు దాటిన డౌన్‌లోడ్లు




- రైల్ వన్ యాప్ సరికొత్త మైలురాయి
- రోజుకు సగటున 10 లక్షల టికెట్లు బుక్
- లోక్‌సభలో వివరాలు వెల్లడించిన కేంద్ర ప్రభుత్వం
- ఒకే యాప్‌లో రైల్వే ప్రయాణికులకు పలు సేవలు
- డిజిటల్ సేవల్లో భాగంగా యాప్‌ను ప్రోత్సహిస్తున్న రైల్వే శాఖ

ఢిల్లీ, ఆగస్టు 12 : భారతీయ రైల్వేకు చెందిన ఏకీకృత మొబైల్ యాప్ 'రైల్ వన్' సరికొత్త మైలురాయిని చేరుకుంది. ఈ యాప్ ఇప్పటివరకు 4.76 కోట్ల డౌన్‌లోడ్లను అధిగమించిందని, దీని ద్వారా ప్రతిరోజూ సగటున 10 లక్షల టికెట్లు **తరువాయి 2లో**

గోదావరి జలాల వినియోగంపై

## సీఎం రేవంత్ కీలక ఆదేశాలు



**2లో**

- గోదావరి నదీ జలాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయం
- ఎల్లంపల్లి, దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల నుంచి నీటిని లిఫ్ట్ చేయాలని సీఎం ఆదేశం
- కాళేశ్వరం బ్యారేజీల భద్రతపై ఎన్డీఎస్ఏ సూచనలను కచ్చితంగా పాటించాలని స్పష్టం
- భూ నిర్వాసితులకు పరిహారం వెంటనే చెల్లించేందుకు కార్యాచరణకు ఆదేశం

ఆపరేషన్ సిందూర్ తర్వాత మారిన పాక్ వ్యూహం..

## ఉగ్ర సంస్థలపై ఐఎస్ఐ పట్టు

**లష్కరే, జైష్, హిజ్బుల్ కార్యకలాపాలను నేరుగా పర్యవేక్షిస్తున్న ఐఎస్ఐ**

- ఇప్పటివరకు ఈ మూడు సంస్థలకు వేర్వేరు కమాండ్ కేంద్రాలు
- ఇక్బాల్, ఒవైజ్ అనే ఇద్దరు ఐఎస్ఐ అధికారుల పర్యవేక్షణలో 3 సంస్థలు
- భారత్‌లోకి చొరబాట్ల విషయంలోనూ ఐఎస్ఐ కొత్త విధానం
- ముగ్గురితో కూడిన బృందాలను పంపుతున్నట్లు సమాచారం

**2లో**



# ఎన్డీఎస్ఏ సూచనల మేరకే మేడిగడ్డ పునరుద్ధరణ

హైదరాబాద్ : జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) సూచనల మేరకే సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల్లో నీటి నిల్వ చేయడంతో పాటు పునరుద్ధరణ పనులు చేపట్టాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మూడు బ్యారేజీల్లో తేలిన సాంకేతిక లోపాలు, తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు సీఎంకు వివరించిన సందర్భంలో సీఎం మాట్లాడుతూ.. సొంత నిర్ణయాలు తీసుకుకోకుండా నిపుణుల సలహా మేరకే ముందుకెళ్లాలని వారికి సూచించారు. ఎల్లంపల్లితో పాటు దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల నుంచి సాధ్యమైనంత మేరకు ఎత్తిపోతలు చేపట్టాలన్నారు. రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డితో కలిసి నీటి పారుదల శాఖపై బుధవారం హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎంసీఆర్‌హెచ్ఆర్డీ)లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో అందుబాటులో ఉన్న గోదావరి జలాలను గరిష్ట స్థాయిలో వినియోగించుకోవాలని ఆదేశించారు. దేవాదుల నుంచి గతంలో ఎన్నడూ లేని విధంగా 9 పంపులతో ఎత్తిపోతలు చేపట్టామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల నుంచి ఎత్తిపోతలకు సంబంధించి ఏవైనా చిన్న చిన్న సమస్యలుంటే వాటి పరిష్కారంపై అధికారులు ప్రత్యేకంగా దృష్టిసారించాలని సీఎం సూచించారు. గోదావరి జలాలు సముద్రంలో కలవకుండా సాధ్యమైనంత వరకు ఎత్తి పోసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ ఏడాది సాగు, తాగు నీరుకు ఇబ్బందులు లేకుండా నీటి పారుదల శాఖ అధికారులు ముందస్తు ప్రణాళికతో ప్రతి నీటి చుక్కను ఒడిసి పట్టాలన్నారు. రాష్ట్రంలో చివరి దశలో ఉన్న పలు ప్రాజెక్టుల కింద కొన్ని గ్రామాలు, కొద్ది పాటి వ్యవసాయ భూములకు పరిహారం చెల్లింపు అంశాలు పెండింగ్‌లో ఉన్నాయనీ, వాటిని వెంటనే చెల్లించేందుకు కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. భూములు కోల్పోయిన రైతులు, ఆస్తులు కోల్పోయిన ప్రజలకు పరిహారం చెల్లింపులో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నీటి పారుదల, రెవెన్యూ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి ముంపు గ్రామాలు వాస్తవ పరిస్థితి, పరిహారం, పునరావాసానికి సంబంధించి నివేదిక రూపొందించాలన్నారు. తక్షణ ప్రభావం పడే గ్రామాలకు వెంటనే పరిహారం చెల్లించాలని సూచించారు. హుస్నాబాద్ నియోజక వర్గంలోని బస్వాపూర్, గౌరవెల్లి ప్రాజెక్టులకు సంబంధించి మిగిలిన చిన్న చిన్న పనులు పూర్తి చేస్తే నీరు నింపే అవకాశం ఉంటుందని సీఎం తెలిపారు. ఈ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గట్టు, గూడెందొడ్డి ఎత్తిపోతల పథకం సామర్థ్యం పెంపునకు సంబంధించి సమగ్ర అధ్యయనం చేయాలని రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సేకరించాల్సిన భూమి, పరిహారం, ఇతర అంశాలపై నివేదిక రూపొందించాలన్నారు. గూడెందొడ్డి పంప్డ్‌స్టోరేజీ ప్రాజెక్టుకు సంబంధించి కన్సల్టెంట్ ను నియమించాలని ఆదేశించారు. కన్సల్టెంట్ నియామకంలో నైపుణ్యం, గత చరిత్రను పరిగణలోకి తీసుకుని ఎంపిక చేయాలన్నారు. గోదావరి, కృష్ణా బేసిన్లలోని ఆయకట్టు కింద ఉన్న రైతులు ఇబ్బందులు పడకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమీక్షలో ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి వి.శేషాద్రి, సెక్రటరీ మాణిక్ రాజ్, రాష్ట్ర నీటి పారుదల శాఖ కార్యదర్శి ఈ.శ్రీధర్, ఆర్అండ్ఆర్ కమిషనర్ శివ కుమార్ నాయుడు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## రికార్డుల దిశగా చార్‌ధామ్ యాత్ర.. 47 లక్షలు దాటిన యాత్రికుల సంఖ్య

(మొదటిపేజీ తరువాయి)
యాత్రా సీజన్ ప్రారంభమైన 114 రోజుల్లోనే మొత్తం 47,02,703 మంది భక్తులు పవిత్ర పుణ్యక్షేత్రాలను దర్శించుకున్నారు. గతేడాది ఇదే సమయంతో పోలిస్తే ఇది 4,68,556 అధికం కావడం విశేషం. ఈ ఏడాది యాత్ర సరికొత్త రికార్డును నెలకొల్పే దిశగా సాగుతోంది. భక్తుల భద్రతే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి స్పష్టం చేశారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ యాత్ర సజావుగా సాగేలా అన్ని సంబంధిత శాఖలు అప్రమత్తంగా ఉండాలని ఆయన ఆదేశించారు. ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తితే తక్షణమే సహాయక చర్యలు చేపట్టేందుకు విపత్తు నిర్వహణ బృందాలు 24 గంటలూ సిద్ధంగా ఉండాలని సూచించారు. రాష్ట్ర విపత్తు నియంత్రణ గది నుంచి ఆయన స్వయంగా పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారు. వాతావరణం అనుకూలించనప్పుడు ప్రభుత్వం యాత్రికుల కదలికలను నియంత్రిస్తూ, యాత్రను తాత్కాలికంగా నిలిపివేస్తోంది. సోమవారం వాతావరణం అనుకూలించకపోయినా 15,376 మంది భక్తులు చార్‌ధామ్‌ను సందర్శించారు. ఈ యాత్రలో భాగంగా బద్రీనాథ్ క్షేత్రానికి అత్యధికంగా 16,12,112 మంది భక్తులు తరలివచ్చారు. ఆ తర్వాత కేదార్‌నాథ్‌ను 14,50,116 మంది, గంగోత్రిని 7,37,629 మంది, యమునోత్రిని 6,62,347 మంది దర్శించుకున్నారు. వీరే కాకుండా, హేమకుండ్ సాహిబ్‌ను 2,40,499 మంది భక్తులు సందర్శించారు. గతేడాదితో పోలిస్తే ఒక్క బద్రీనాథ్‌లోనే 3.5 లక్షల మందికి పైగా అదనపు యాత్రికులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. గంగోత్రి, యమునోత్రి ఆలయాల ద్వారాలను ఏప్రిల్ 19న తెరవడంతో ఈ ఏడాది చార్‌ధామ్ యాత్ర ప్రారంభమైంది. ఏప్రిల్ 23న బద్రీనాథ్ ఆలయాన్ని తెరిచారు. హిందూ మతంలో అత్యంత పవిత్రమైన పుణ్యక్షేత్రాలైన యమునోత్రి, గంగోత్రి, కేదార్‌నాథ్, బద్రీనాథ్‌లను కలిపి ఛోటా చార్‌ధామ్‌గా పిలుస్తారు. 8వ శతాబ్దంలో ఆది శంకరాచార్యులు దేశ ఆధ్యాత్మిక, సాంస్కృతిక ఐక్యతను బలోపేతం చేసేందుకు ఈ యాత్రా సంప్రదాయాన్ని ప్రాచుర్యంలోకి తెచ్చారు.

## చంద్రబాబు ఒక విజనరీ లీడర్: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనా దక్షతపై భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రశంసలు కురిపించారు. చంద్రబాబు విజనరీ లీడర్ అని కొనియాడిన ఆమె... రాష్ట్రంలో నిజమైన అభివృద్ధికి ఆయనే అసలైన చిరునామా అని స్పష్టం చేశారు. సాంకేతికత, పాలన, మౌలిక సదుపాయాల కల్పనలో ఆయన చేపట్టిన సంస్కరణలు రాష్ట్రాన్ని ప్రగతి పథంలో ముందుకు నడిపిస్తున్నాయని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ సమగ్ర అభివృద్ధికి, ముఖ్యంగా అమరావతి నిర్మాణానికి, ఐటీ, పారిశ్రామిక రంగాల పురోగతికి చంద్రబాబు చేస్తున్న కృషి అభినందనీయమని రాష్ట్రపతి అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా దూరదృష్టి కలిగిన నాయకత్వంతో ఏపీని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని కొనియాడారు. రాష్ట్రపతి నుంచి వచ్చిన ఈ ప్రశంసలపై టీడీపీ శ్రేణులు, కూటమి నాయకులు తీవ్ర హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్మును విజయనగరం టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తన కుటుంబంతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రపతికి 'అమరావతి' కాఫీ టేబుల్ బుక్‌ను బహుకరించారు. ఆ పుస్తకంలోని రాజధాని అమరావతి విశేషాలు, ఫొటోలను రాష్ట్రపతి ఎంతో ఆసక్తిగా తిలకించారు. ఈ క్రమంలోనే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు దూరదృష్టిని కొనియాడుతూ, ఆయన నిజమైన అభివృద్ధికి చిరునామా అని, ఒక విజనరీ లీడర్ అని రాష్ట్రపతి ప్రశంసల వర్షం కురిపించారు. అంతేకాకుండా, ఎంపీ అప్పలనాయుడి నిబద్ధతను రాష్ట్రపతి ప్రత్యేకంగా అభినందించారు. పార్లమెంట్ సమావేశాలకు ప్రతిరోజూ సైకిల్‌పై రావడం, 100 శాతం హాజరు నమోదు చేసుకోవడంపై సంతోషం వ్యక్తం చేశారు. సంస్కారం, నిరాడంబరత కలిగిన అప్పలనాయుడిని చూస్తుంటే "నన్ను నేను చూసుకున్నట్లే ఉంది" అని అన్నారు.

## జెన్‌జీకి.. ప్రధాని మోదీ కీలక సూచన

(మొదటిపేజీ తరువాయి)
రామ్‌నాథ్ కోవింద్ ఆత్మకథ 'ట్రయంఫ్ ఆఫ్ ది ఇండియన్ రిపబ్లిక్: మై లైఫ్, మై స్ట్రగుల్స్' ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. రైల్వే స్టేషన్లలో తరచూ కనిపించే ఒక హెచ్చరికను ప్రధాని ఈ సందర్భంగా గుర్తుచేశారు. "షార్ట్‌కట్ విల్ కట్ యు షార్ట్" (అడ్డదారి మీ జీవితాన్ని కుదిస్తుంది) అనే బోర్డు కేవలం రైల్వే ట్రాక్‌లకే కాకుండా, నిజ జీవితానికి కూడా వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు అందుబాటులో ఉన్నప్పటికీ, త్వరగా వెళ్లాలనే తొందరలో కొందరు ప్రమాదకరంగా పట్టాలు దాటుతుంటారని, అటువంటి అనాలోచిత నిర్ణయాలు ప్రాణాంతకమని ఆయన హెచ్చరించారు. యువత తప్పుడు మార్గాలను వీడి, అర్థవంతమైన జీవన గమనాన్ని ఎంచుకోవాలని ప్రధాని మోదీ సూచించారు. "మీరు ఆరాధించే మహనీయుల జీవిత చరిత్రలను తప్పనిసరిగా చదవండి. వాటి ద్వారా స్ఫూర్తి పొంది సరైన మార్గాన్ని కనుగొనవచ్చు" అని ఆయన యువతకు సలహా ఇచ్చారు. ముఖ్యంగా ఆలోచనా విధానాన్ని ప్రభావితం చేసే ఇన్‌ఫ్లుయెన్సర్ల కంటెంట్ పట్ల నిరంతరం జాగ్రత్తగా ఉండాలని ఆయన హితవు పలికారు.

## గోదావరి జలాల వినియోగంపై సీఎం రేవంత్ కీలక ఆదేశాలు

గోదావరి నదీ జలాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ఎల్లంపల్లి, దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల ద్వారా నీటి ఎత్తిపోతల (లిఫ్ట్) ప్రక్రియను ముమ్మరం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన నీటిపారుదల శాఖపై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) సిఫార్సుల మేరకు ప్రస్తుతం సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీలలో నీటిని నిల్వ చేయడం లేదని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. ఎన్డీఎస్ఏ మార్గదర్శకాలను అధికారులు కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. మేడిగడ్డ, సుందిళ్ల బ్యారేజీలలో కొన్ని లోపాలను గుర్తించినట్లు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించగా, ఈ అంశంపై తక్షణమే ఎన్డీఎస్ఏను సంప్రదించాలని సీఎం సూచించారు. దేవాదుల ప్రాజెక్టులో తొమ్మిది పంపుల ద్వారా నీటిని లిఫ్ట్ చేయడం కీలకమని, అక్కడ ఎదురవుతున్న చిన్నచిన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వివిధ ప్రాజెక్టుల కింద భూములు కోల్పోయిన రైతులకు చెల్లించాల్సిన పరిహారంపై కూడా ఈ సమావేశంలో సమీక్షించారు. నష్టపరిహారాన్ని తక్షణమే చెల్లించేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ముంపునకు గురయ్యే గ్రామాలు, పెండింగ్ పరిహారం, పునరావాస ప్యాకేజీలపై క్షేత్రస్థాయిలో పర్యటించి సమగ్ర నివేదికలు అందజేయాలని రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారులను ఆదేశించారు. బాధితులకు త్వరితగతిన పరిహారం చెల్లిస్తేనే బస్వాపూర్, గౌరవెల్లి ప్రాజెక్టులను నింపడానికి వీలవుతుందని ఆయన పేర్కొన్నారు. గట్టు, గుడెందొడ్డి ఎత్తిపోతల పథకాల సామర్థ్యం పెంపుపై తగిన అధ్యయనం చేయాలని, గుడెందొడ్డి పంప్ స్టోరేజ్ ప్రాజెక్టుకు కన్సల్టెంట్‌ను నియమించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## 'రైల్ వన్' యాప్‌కు విశేష ఆదరణ.. 4.76 కోట్లు దాటిన డౌన్‌లోడ్లు

(మొదటిపేజీ తరువాయి)
బుక్ అవుతున్నాయని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. బుధవారం నాడు లోక్‌సభలో అడిగిన ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిస్తూ రైల్వే శాఖ సహాయ మంత్రి వి. సోమన్న ఈ వివరాలను వెల్లడించారు. రైల్వే ప్రయాణికుల ప్రయాణ అనుభవాన్ని మరింత సులభతరం చేసేందుకు ఈ యాప్‌ను ప్రారంభించారు. గతంలో వేర్వేరు యాప్‌లు, వెబ్‌సైట్లలో విడివిడిగా అందుబాటులో ఉండే టికెట్ బుకింగ్, పీఎన్ఆర్ స్టేటస్, లైవ్ ట్రైన్ ట్రాకింగ్, ఫుడ్ ఆర్డరింగ్, ఫిర్యాదుల నమోదు వంటి సేవలన్నీ ఇప్పుడు 'రైల్ వన్' వేదికగా ఒకే చోట లభిస్తున్నాయి. ఒకే అప్లికేషన్‌లో అన్ని రకాల సౌకర్యాలు లభిస్తుండటంతో ప్రయాణికులు ఈ యాప్‌ను వినియోగించేందుకు ఆసక్తి చూపుతున్నారని అధికారులు పేర్కొన్నారు. రోజుకు సగటున 10 లక్షల టికెట్లు బుక్ అవుతుండటం ఈ యాప్‌కు




లభిస్తున్న ఆదరణకు నిదర్శనమని మంత్రిత్వ శాఖ తెలిపింది. రిజర్వ్‌డ్, అన్‌రిజర్వ్‌డ్ విభాగాల్లో ఈ బుకింగ్స్ జరుగుతున్నాయని వివరించింది. యాప్‌లో ఎప్పటికప్పుడు నూతన ఫీచర్లను అందుబాటులోకి తీసుకురావడం, సర్వర్ల సామర్థ్యాన్ని పెంచడం వల్లే ఎటువంటి అంతరాయం లేకుండా సేవలను అందించగలుగుతున్నామని పేర్కొంది. దేశవ్యాప్తంగా ప్రయాణికులకు డిజిటల్ సేవలను మరింత చేరువ చేసే లక్ష్యంతో రైల్వే శాఖ ఈ యాప్‌ను ప్రోత్సహిస్తోంది.

## ఇంటింటికీ తెలుగుదేశం 17 రోజుల్లో 50 లక్షల ఇళ్ల సందర్శన

తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ఇంటింటికీ తెలుగుదేశం - 2 ఏళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం' కార్యక్రమం ఒక కీలక మైలురాయిని అధిగమించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా చేపట్టిన ఈ కార్యక్రమం, కేవలం 17 రోజుల్లోనే 50 లక్షల ఇళ్ల సందర్శన మార్క్‌ను దాటింది. ప్రభుత్వ విజయాలను ప్రజలకు నేరుగా చేరవేసే లక్ష్యంతో ఈ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతోంది. మంగళవారం నాటికి 17 రోజులు పూర్తి చేసుకున్న ఈ కార్యక్రమం ద్వారా టీడీపీ శ్రేణులు మొత్తం 50.62 లక్షల ఇళ్లను సందర్శించాయి. పార్టీ నాయకులు, కార్యకర్తలు సగటున ప్రతిరోజూ మూడు లక్షలకు పైగా కుటుంబాలను కలుస్తున్నారు. 17వ రోజైన మంగళవారం ఒక్కరోజే 3.12 లక్షల ఇళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా, ఎన్నికల సమయంలో ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీల అమలు తీరు, రైతులు, మహిళలు, యువతకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు వివరిస్తున్నారు. ప్రభుత్వ పథకాలను వివరించడంతో పాటు, క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి అభిప్రాయాలు, స్థానిక సమస్యలను కూడా స్వీకరించి, వాటిని ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్తున్నారు. 50 లక్షల ఇళ్ల సందర్శన మైలురాయిని అధిగమించడంపై టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేశ్ పార్టీ శ్రేణులకు అభినందనలు తెలిపారు. ఇంత భారీ స్థాయిలో ప్రజలతో మమేకమవుతున్న నాయకులు, కార్యకర్తల కృషిని ఆయన ప్రశంసించారు. అదే సమయంలో, కార్యక్రమం నెమ్మదిగా సాగుతున్న నియోజకవర్గాలపై ఆయన ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. 25 వేల కంటే తక్కువ సందర్శనలు నమోదైన నియోజకవర్గాలు, సుమారు 4,220 బూత్‌ల పనితీరును పరిశీలించినట్లు సమాచారం. 50 లక్షల మైలురాయి స్ఫూర్తితో కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని లోకేశ్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

## ఆపరేషన్ సిందూర్ తర్వాత మారిన పాక్ వ్యూహం.. ఉగ్ర సంస్థలపై ఐఎస్ఐ పట్టు

పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఉగ్ర సంస్థల కార్యకలాపాల తీరు మారినట్లు భారత నిఘా వర్గాలు గుర్తించాయి. ఆపరేషన్ సిందూర్ తర్వాత లష్కర్‌ఏతోయిబా, జైష్‌ఏమహ్మద్, హిజ్బుల్ ముజాహిదీన్‌ల కార్యకలాపాలపై పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ నేరుగా పట్టు సాధించినట్లు సమాచారం. ఇప్పటివరకు ఈ మూడు సంస్థలకు వేర్వేరు కమాండ్ కేంద్రాలు ఉండేవి. చొరబాట్లు, ఇతర కార్యకలాపాలను ఆయా సంస్థల నేతలు, హ్యాండ్లర్లు పర్యవేక్షించేవారు. తాజాగా ఈ విధానాన్ని మార్చినట్లు అధికారులు తెలిపారు. బ్రిగేడియర్ ఇక్బాల్, కల్నల్ ఒవైజ్ అనే ఇద్దరు ఐఎస్ఐ అధికారులు మూడు సంస్థల కార్యకలాపాలను పర్యవేక్షిస్తున్నట్లు వెల్లడించారు. వారి అనుమతి తర్వాతే కీలక చర్యలు ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు. చొరబాట్ల విషయంలోనూ ఐఎస్ఐ కొత్త విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో ఐదారుగురు ఉగ్రవాదులు కలిసి చొరబడేందుకు ప్రయత్నించేవారు. ఇప్పుడు ముగ్గురితో కూడిన బృందాలను పంపుతున్నట్లు అధికారులు తెలిపారు. లష్కర్, జైష్, హిజ్బుల్ నుంచి ఒక్కొక్కరు ఉండేలా బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. నియంత్రణ రేఖ అవతల 500 మందికిపైగా ఉగ్రవాదులు భారత్‌లోకి చొరబడేందుకు సిద్ధంగా ఉన్నట్లు నిఘా సంస్థలు గతంలో గుర్తించాయి. మరోవైపు జమ్మూకశ్మీర్‌లో స్థానిక యువతను ఆకర్షించేందుకు ఐఎస్ఐ ప్రయత్నిస్తున్నట్లు అధికారులు తెలిపారు. అఫ్ఘనిస్థాన్, ఆఫ్రికాలో ఉన్న నెట్‌వర్క్‌ల ద్వారా యువతను ప్రభావితం చేసే ప్రయత్నాలు జరుగుతున్నట్లు చెప్పారు. ఎంపికైన యువతకు ఒంటరిగా దాడులు చేయడం, స్థానిక వస్తువులతో ఐఈడీల తయారీపై శిక్షణ ఇచ్చే అవకాశం ఉందని అధికారులు వివరించారు.

## తెలంగాణకు 11.56 లక్షల ఇళ్లు కేటాయించండి

ఢిల్లీ: ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ 2.0 కింద తెలంగాణకు 11,56,915 ఇళ్లను కేటాయించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారమిక్కడ ఆయన కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా 'ఆవాస్ ప్లస్ 2024' యాప్ ద్వారా పారదర్శకంగా ఇంటింటి సర్వే నిర్వహించామని.. ఇందులో 11.56 లక్షలకుపైగా కుటుంబాలు ఇళ్లకు అర్హమైనవిగా తేలిందని కేంద్ర మంత్రికి తెలియజేశారు. ఏడాది క్రితమే అనర్హుల తొలగింపు ప్రక్రియను పూర్తి చేసినప్పటికీ కేంద్రం ఇళ్ల మంజూరులో జాప్యం చేస్తోందని చెప్పారు. 12 ఏళ్లుగా రాష్ట్రంలో పేదలకు ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోయాయని, అందుకే పెద్ద మొత్తంలో మంజూరు చేయాలని విన్నవించారు. కేంద్ర పథకంతో సంబంధం లేకుండా కొత్త ఇళ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సాయం చేస్తోందన్నారు. కేంద్రమంత్రిని కలిసిన వారిలో ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, వేం నరేందర్‌రెడ్డి, సురేశ్ షెట్కార్, రామసహాయం రఘురాంరెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ వీపీ గౌతమ్ తదితరులు ఉన్నారు. రాష్ట్రానికి వచ్చి స్వయంగా పీఎంఏవైజీ 2.0 ఇళ్ల కేటాయింపును ప్రకటించాలని కేంద్ర మంత్రికి విన్నవించగా.. ఆయన సానుకూలంగా స్పందించారని మంత్రి పొంగులేటి ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

# రోడ్డు భద్రత మౌలిక వసతుల పనులను వేగవంతం చేయాలి

* నితిన్ గడ్కరీని కోరిన ఎంపీ. చామల



భువనగిరి,ప్రజాస్ఫూర్తి : భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి కేంద్ర రోడ్డు రవాణా , రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ని కలిసి భువనగిరి పార్లమెంటరీ నియోజకవర్గ పరిసర ప్రాంతాలలో అనేక ముఖ్యమైన రోడ్డు మౌలిక వసతులు మరియు భద్రతా పనులను వేగవంతం చేయాల్సిందిగా కోరారు.ఈ సమావేశంలో ఎంపీ పలు కీలక ప్రాజెక్టులపై ప్రాధాన్యతతో కూడిన జోక్యాన్ని కోరుతూ సమగ్ర వినతిపత్రాలను సమర్పించి చర్చించారు.హైదరాబాద్ వరంగల్ మధ్య ఉన్న NH163 ను ఆరు లైన్ల జాతీయ రహదారిగా అప్‌గ్రేడ్ చేయడం ప్రధాన డిమాండ్‌గా ఉంది. ఈ కీలక కారిడార్‌లో వేగంగా పెరుగుతున్న జనాభా, పట్టణీకరణ, పారిశ్రామిక కార్యకలాపాలు, ట్రాఫిక్ కదలికలను చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రస్తావించారు. విస్తరణ , అనుబంధ మెరుగుదల కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రిత్వ శాఖను కోరారు. అలాగే, NH163 పై అనేక రోడ్డు భద్రతా అవసరాలను కూడా ఎంపీ లేవనెత్తారు. నకిరేకల్ అసెంబ్లీ నియోజకవర్గంలో NH 565 పై నకిరేకల్ తాటికల్ రోడ్డు విస్తరణ, చందంపల్లి వద్ద ప్రతిపాదిత లూప్ ఫోర్, పద్మనగర్ , ఇనుపముల వద్ద ఫ్లైఓవర్లు, కోర్లపహాడ్, కేతేపల్లి, చీకటిగూడెం, వట్టిమర్తి, పిట్టంపల్లి వద్ద అండర్‌పాస్‌లతో పాటు డ్రైనేజీ మరియు సర్వీసు రోడ్డు పనులతో సహా అనేక రోడ్డు భద్రత మరియు కనెక్టివిటీ అవసరాలను కూడా ఎంపీ కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. NH365 (హైదరాబాద్ విజయవాడ) పై లక్ష్మారెడ్డి పల్లెం పెద్ద అంబర్‌పేట్ వద్ద ఉన్న హనుమాన్ ఆలయం సమీపంలో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణంపై ప్రత్యేకంగా ప్రస్తావించారు. ముఖ్యంగా పండుగల సమయంలో ఆలయం వద్ద భక్తులు మరియు జనల రద్దీ ఎక్కువగా ఉంటుందని, దీనివల్ల ట్రాఫిక్ జామ్ మరియు భద్రతా సమస్యలు తలెత్తుతున్నాయని ఎంపీ తెలిపారు. భువనగిరి ప్రజలకు, పరిసర ప్రాంతాల వారికి మెరుగైన కనెక్టివిటీ కల్పించడంతో పాటు రోడ్డు భద్రతను పెంపొందించడం, ప్రమాదాలను నివారించడం, ట్రాఫిక్ రద్దీని తగ్గించి రాకపోకలు సజావుగా సాగేందుకు పైన పేర్కొన్న ప్రాజెక్టులు ఎంతో కీలకమని చామల కిరణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఈ ముఖ్యమైన పనులను త్వరితగతిన చేపట్టేందుకు అవసరమైన ప్రక్రియలను వేగవంతం చేయడంలో కేంద్ర మంత్రి మరియు రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ సహకారం ఎంతో అవసరమని ఆయన వ్యక్తం చేశారు.

## జిల్లెల్లగడ్డ గ్రామంలో సీసీ కెమెరాలు ప్రారంభించిన ఎస్సై లక్ష్మారెడ్డి



హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : గ్రామాల్లో శాంతిభద్రతలను మరింత పటిష్టం చేయడంతో పాటు నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల నివారణకు సీసీ కెమెరాలు కీలకపాత్ర పోషిస్తాయని హుస్నాబాద్ ఎస్సై పాకాల లక్ష్మారెడ్డి పేర్కొన్నారు.సురక్ష నేత్ర కార్యక్రమంలో భాగంగా హుస్నాబాద్ మండలంలోని జిల్లాల గడ్డ గ్రామంలో ఏర్పాటు చేసిన 10 సీసీ కెమెరాలను స్థానిక సర్పంచ్ లావుడియా సరూప లింగ నాయక్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని గ్రామంలోని ముఖ్యమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సీసీ కెమెరాల ద్వారా గ్రామంలో జరిగే ముఖ్యమైన కార్యకలాపాలను నిరంతరం పర్యవేక్షించే అవకాశం ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన యువతకు ఉపాధి కల్పించాలని జాతీయ ఎస్టీ కమీషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్ వినతి

- 18వ వార్డు కౌన్సిలర్ బుడ్డ సురేష్



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి : హైదరాబాద్ లోని దిలుకుషా భవనంలో జాతీయ ఎస్టీ కమీషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్ ను బుధవారం చౌటుప్పల్ మున్సిపాలిటీ 18వ వార్డు కౌన్సిలర్ బుడ్డ సురేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. చౌటుప్పల్ మండల పరిధి లో ఉన్న పరిశ్రమలలో గిరిజన యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని విన్నవించారు. అదేవిధంగా మున్సిపాలిటీ గిరిజనకాలనీలకు, వార్డులకు, గిరిజన తండాలకు ప్రత్యేక అభివృద్ధి నిధులను, కంపెనీ ల సి ఎస్ ఆర్ నిధులను కేటాయించలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు.

## అర్హులైన వారందరికీ పెన్షన్లు ఇవ్వాలి


- మున్సిపల్ కమిషనర్ కు వినతి
- ఎండి పాషా




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ పరిధిలోని పేద ప్రజలందరికీ అర్హతను బట్టి అన్ని రకాల పెన్షన్లు ఇవ్వాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎండి పాషా డిమాండ్ చేశారు. చౌటుప్పల్ మున్సిపల్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండి పాషా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు పెన్షన్లను డబల్ చేస్తానని హామీ ఇచ్చి, అధికారం చేపట్టాక విస్మరించిందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వానికి నిధులు లేవని చెప్పి వృద్ధాప్య పెన్షన్ ఇవ్వకుండా, కేవలం మిగతా పెన్షన్లను ఇచ్చి హామీలను దాటవేస్తే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. అర్హులైన వారికి అందరికీ అన్ని రకాల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిచో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు నాయక్ కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ చౌటుప్పల్ మున్సిపల్ కార్యదర్శి గోశిక కరుణాకర్, సిపిఎం పార్టీ నాయకులు బండారు నర్సింహ, ఆకుల ధర్మయ్య, గోపగోని లక్ష్మణ్ గౌడ్, బత్తుల శ్రీశైలం గౌడ్, భావండ్లపల్లి స్వామి, బత్తుల లక్ష్మయ్య, సప్పిడి శ్రీనివాసరెడ్డి, సిలివేరు జంగయ్య, మగుదల రాములు, బాబు, బిక్షపతి, తొర్పునూరి మల్లేశం, పాల్గొనడం జరిగింది.

## చౌటుప్పల్ మండల ఫోటో, వీడియో గ్రాఫర్స్ నూతన కమిటీ ఎన్నిక

- నూతన అధ్యక్షునిగా సుక్క స్వామి



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మండల కేంద్రంలో ఫోటో, వీడియోగ్రాఫర్స్ సంక్షేమ సంఘం సమావేశం బుధవారం నిర్వహించారు. ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రోజు యజ్ఞమాచారి ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా తోర్పునూరి సాయిలు గౌడ్, చింతల గణేష్, భారత మధు, వరగంటి వెంకటేష్, నందగిరి పరమేష్, జక్క చలమంద రెడ్డి, బోడిగే ప్రభాకర్, నూతన కమిటీ అధ్యక్షునిగా సుక్క స్వామి, ఉపాధ్యక్షులుగా ఎర్ర శివ, వరికుప్పల మహేష్, ప్రధాన కార్యదర్శిగా వనం ఋషి, కోశాధికారిగా రోషనగారి రాఘవేంద్ర గౌడ్, సహాయ కార్యదర్శిగా పల్లెర్ల సుజిక్ , ప్రచార కార్యదర్శిగా పగడాల శంకర్, కార్యవర్గ సభ్యులు మలిగె రవి, పగిళ్ల మహేష్, డాకోజీ వెంకట శివకుమార్, జాజుల రామకృష్ణ, పెడకంటి నాగేంద్రలను ఎన్నుకున్నారు.

## జనగామలో ఉపాధ్యాయుల నిరసన

జనగామ,ప్రజాస్ఫూర్తి : జిల్లా లోని బచ్చన్నపేట మండల కేంద్రంలో ఉపా ధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూపీఎస్సీ ) ఆధ్వర్యంలో ఉపాధ్యా యులు నిరసన చేపట్టారు. రాష్ట్ర శాఖ పిలుపు మేరకు రెండో దశ పోరాటంలో భాగంగా తహసీల్దార్ కార్యాలయం ఎ దుట ఆందోళన నిర్వహించారు.పి.అర్.సి, డి.ఏ బకాయిల చెల్లింపు, 317 జీ. ఓ సమస్య పరిష్కారం సహా ఉపాధ్యా యుల సమస్యలను వెంటనే పరిష్కరిం చాలని నాయకులు డిమాండ్ చేశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల పట్ల రా ష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానా లను వారు తీవ్రంగా ఖండించారు. సమ స్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం గా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన మెమొరాండాన్ని తహసీల్దార్ ప్రకాష్‌రావుకు అందజేశారు.

## సింగరేణి ప్రధాన ఆసుపత్రిని తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన ఆసుపత్రిని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ బుధవారం తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని వివిధ విభాగాలను కలియతిరిగి పరిశీలించిన ఆయన, రోగులకు అందుతున్న వైద్య సేవలు, సౌకర్యాలు, వైద్య సిబ్బంది పనితీరు తదితర అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా పిల్లల వార్డు, ప్రసూతి వార్డు, సర్జికల్ వార్డు, ఐసీయూ, పురుషుల వార్డు, ఆపరేషన్ థియేటర్, ఎక్స్‌రే విభాగం, ఇమ్యునైజేషన్ విభాగం తదితర విభాగాలను సందర్శించి అక్కడ అందుతున్న సేవలను పరిశీలించారు. వివిధ వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి, వారికి అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో వైద్య సేవల నాణ్యత, పారిశుధ్యం, రోగులకు అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలపై సంబంధిత అధికారులతో చర్చించారు.ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా వైద్యులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని డీఎంహెచ్ఓ సూచించారు. ముఖ్యంగా అత్యవసర వైద్య సేవలు, ప్రసూతి మరియు శిశు వైద్యం, శస్త్రచికిత్సలు తదితర సేవల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని సూచించారు. ఈ తనిఖీలో సింగరేణి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్ రాజ్ కుమార్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ప్రతాప్, నాగభూషణం, రాంప్రసాద్, సింగరేణి హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సీతారాం ఏచూరి స్ఫూర్తితో యువత నడవాలి

- నలంద డిగ్రీ కళాశాలలో కామ్రేడ్ సీతారాం ఏచూరి వర్ధంతి కార్యక్రమం



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: విద్యార్థి ఉద్యమానికి కామ్రేడ్ సీతారాం ఏచూరి చేసిన సేవలు నేటి యువతకు మార్గదర్శకమని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకురాలు మేడబోయిన మమత అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం నలంద డిగ్రీ కళాశాలలో కామ్రేడ్ సీతారాం ఏచూరి వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకురాలు మేడబోయిన మమత, హాజరై, ఎస్ఎఫ్ఐ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు వేముల నాగరాజుతో కలిసి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేడబోయిన మమత మాట్లాడుతూ సీతారాం ఏచూరి కేవలం ఒక రాజకీయ నాయకుడు మాత్రమే కాదని, విద్యార్థి ఉద్యమం నుంచి ఎదిగి దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన గొప్ప నాయకుడన్నారు. ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షుడిగా పనిచేసి విద్యార్థి ఉద్యమాన్ని దేశవ్యాప్తంగా బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. సీతారాం ఏచూరి రాజ్యసభలో కూడా ప్రజా సమస్యలను బలంగా ప్రస్తావించిన పార్లమెంటేరియన్‌గా గుర్తింపు పొందారన్నారు. విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని, అన్యాయాన్ని ఎదిరించాలని, శాస్త్రీయ దృక్పథంతో ముందుకు సాగాలని, కులం, మతం పేరుతో జరిగే విభజనలను తిరస్కరించి, ప్రజాస్వామ్యాన్ని లౌకిక విలువలను కాపాడినప్పుడే ఇదే సీతారాం ఏచూరికి నిజమైన నివాళి అన్నారు. ఎస్ఎఫ్ఐ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు వేముల నాగరాజు మాట్లాడుతూ సీతారాం ఏచూరి జీవితం విద్యార్థి ఉద్యమానికి ఒక పాఠశాల వంటిదన్నారు. విద్యార్థుల సమస్యలపై పోరాడటంతో పాటు దేశంలో ప్రజాస్వామ్య, లౌకిక విలువలను పరిరక్షించేందుకు ఆయన జీవితాంతం పోరాడారన్నారు. కామ్రేడ్ సీతారాం ఏచూరి ఆశయాల సాధన కోసం విద్యార్థి యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి తీగుళ్ళ శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షురాలు సృజన, మండల నాయకులు మల్లేష్, అరవింద్, ఆకాష్, మోనోర్ కళాశాల విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు దిక్సూచి ఏఐఎస్ఎఫ్

* ఘనంగా 91వ వార్షికోత్సవాలు



ప్రజాస్ఫూర్తి, నల్లగొండ : నల్లగొండ జిల్లా కేంద్రంలో ఏఐఎస్ఎఫ్ 91వ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. మాజీ సి పి ఐ నాయకులు న్యాయవాది మల్లేపల్లి ఆది రెడ్డి జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల తలలో నాలుక లాగా, నిరంతరం విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు చేస్తున్నటువంటి విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని కొనియాడారు. 1936లో ఆవిర్భావించి స్వాతంత్ర పోరాటంలో కీలకపాత్ర వహించిందని అన్నారు. ప్రభుత్వాలు విద్యార్థులను పట్టించుకోకుండా నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్నారని అన్నారు.విద్యార్థులు తమ హక్కుల కోసం పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. సంగం రాష్ట్ర ఉపాధ్యక్షులు బరిగల వెంకటేష్, జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిత్యం కాషాయకరణ చేయాలని, ప్రైవేటీకరణ చేయాలని నూతన విద్యా విధానం తీసుకువచ్చిందని, వి బి ఎస్ ఏ బిల్లును తీసుకువచ్చిందని, ప్రశ్నించిన విద్యార్థులపై కేసులు బనాయిస్తూ, విద్యార్థుల ని భయ భ్రాంతులకు గురి చేస్తుందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం నారాయణ చైతన్య లాంటి కార్పొరేట్ విద్యా సంస్థలను అనుమతులిస్తూ, ప్రభుత్వ పాఠశాలలను, కళాశాలలో మూసివేస్తుందని దుయ్యబట్టారు. ప్రభుత్వ విద్య పరిరక్షణ కోసం విద్యార్థులతో కలిసి ఏఐఎస్ఎఫ్ పెద్ద ఎత్తున ఉద్యమిస్తుందని అన్నారు.జిల్లా ఉపాధ్యక్షులు సూర్య తేజ, పట్టణ నాయకులు శ్రీకాంత్, అర విందు, మనోహర్, తేజ, సాయి, అరుణ్,తదితరులు పాల్గొన్నారు.

## ప్రముఖ డాక్టర్ రమేష్‌బాబుకు మొక్కతో పుట్టినరోజు శుభాకాంక్షలు



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:అర్థ శతాబ్ద కాలంగా కొత్తగూడెం ప్రజలకే కాకుండా అనేక ప్రాంతాల వారికి వైద్య పరంగా, సామాజికపరంగా నిరంతరాయంగా సేవలందిస్తున్న ప్రముఖ సీనియర్ సర్జన్ డాక్టర్ వాసిరెడ్డి రమేష్ బాబు పుట్టినరోజు సందర్భంగా ప్రకృతి ప్రేమికులు మొక్కను అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం పోస్ట్ ఆఫీస్ సెంటర్ వద్ద గల నవీన్ నర్సింగ్ హోమ్ అధినేత, జాతీయ బాలోత్సవ్ కన్వీనర్, సీనియర్ వైద్యులు, సామాజ సేవకులు, ప్రకృతి ప్రేమికులు, కొత్తగూడెం ప్రకృతి ఆశ్రమం గౌరవాధ్యక్షులు డాక్టర్ వాసిరెడ్డి రమేష్ బాబును శాలువాతో ఘనంగా సత్కరించి, మొక్కలను అందజేశారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో పర్యావరణవేత్త మొక్కల వెంకటయ్య, ప్రకృతి వైద్యులు జి.సుగుణారావు, చిన్నారి మొక్కల ప్రేమికురాలు నైనికా రజువా, ప్రకృతి ప్రేమికులు దశరథ్ రజువా, గోరింట్ల శోభారాణి, ఝాన్సీ రజువాలు పాల్గొన్నారు.

## ప్రమాదాల నివారణ.. ప్రతి ఒక్కరి బాధ్యత

- రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం
- చౌటుప్పల్ ట్రాఫిక్ సిఐ నందగిరి వెంకటేశం




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలని చౌటుప్పల్ ట్రాఫిక్ సిఐ నందగిరి వెంకటేశం అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ,, ట్రాఫిక్ డిఎస్పి సూచనల మేరకు చౌటుప్పల్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో చౌటుప్పల్ మండలం అంకిరెడ్డిగూడెం గ్రామంలో రోడ్డు భద్రతపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఆటో డ్రైవర్లు, కంపెనీ కార్మికులకు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రతా చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సిఐ నందగిరి వెంకటేష్ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. వాహనాలు నడిపే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రఘునాథపల్లిలో ఘనంగా బీజేపీ 'హర్ ఘర్ తిరంగా' యాత్ర



జనగామ, ప్రజాస్ఫూర్తి : రఘునాథపల్లి మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో 'హర్ ఘర్ తిరంగా' యాత్ర ఉత్సాహంగా నిర్వహించారు. మండల బీజేపీ ప్రధాన కార్యదర్శి ఉడుత రంజిత్ యాదవ్ ఆధ్వర్యంలో జాతీయ రహదారి పై 150 అడుగుల భారీ జాతీయ జెండాతో ప్రదర్శన చేపట్టారు. దేశభక్తి, జాతీయ ఐక్యత భావాలను ప్రజల్లో పెంపొందించడమే లక్ష్యంగా యాత్ర నిర్వహించి నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు,కార్యకర్తలు, విద్యార్థులు జాతీయ జెండాలతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

## దోసపాడు నుండి మంచినీటి సరఫరా పునరుద్ధరణకు చర్యలు



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: దోసపాడు నుండి సూర్యాపేటకు మంచినీటి సరఫరా పునరుద్ధరణ చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నామని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మోరిశెట్టి నివేదిత లక్ష్మీది అన్నారు. బుధవారం 40 వ వార్డులో 5 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న నాలుగు కల్వర్టుల నిర్మాణానికి వారు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సూర్యాపేట పట్టణంలో మంచినీటి సరఫరా మెరుగుపరచడానికి చర్యలు చేపట్టినట్టు చెప్పారు. మిషన్ భగీరథ ద్వారా వచ్చే నీటి సరఫరా పెంచడానికి ప్రయత్నాలు చేస్తున్నామని అన్నారు. అదేవిధంగా పట్టణంలో అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు చేయవలసిందిగా జిల్లా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేస్తామని చెప్పారు. ఇటీవల నాగార్జునసాగర్ వరుణ యాగం సందర్భంగా ముఖ్యమంత్రిని కలిశామని ఆయన అన్నారు. 60 ఫీట్ల రోడ్ అండర్ పాస్ సమస్య పరిష్కారానికి హైవే అధికారులతో మాట్లాడుతున్నామని చెప్పారు. పట్టణంలో అన్ని వార్డుల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, కౌన్సిలర్లు కొణతం రాజేష్ రెడ్డి, కొండపల్లి దిలీప్ రెడ్డి, చిలుముల సునీల్ రెడ్డి, నాగుల వాసు, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్,తంగెళ్ల కరుణాకర్ రెడ్డి , నరేందర్ నాయుడు, ఆలేటి మాణిక్యం,మద్దెబోయిన శ్రీనివాస్, నరేష్‌పిళ్లై ,వంశి, వెంకన్న, సంజయ్, వార్డు జవాను శ్రవణ్, వార్డు ఆఫీసరు సత్య తదితరులు పాల్గొన్నారు.

# ఎర్ర సత్యం ముదిరాజ్ కు ఘన నివాళులు



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజా స్ఫూర్తి : ముదిరాజ్, బీసీ వర్గాల హక్కుల కోసం పోరాడిన పోరాట యోధుడు ఎర్ర సత్యం ముదిరాజ్ వర్ధంతి సందర్భంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ ఆయనకు ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా రవి పటేల్ మాట్లాడుతూ ఎర్ర సత్యం ముదిరాజ్ బీసీ ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడుతూ, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి విశేష కృషి చేశారని గుర్తు చేశారు. ఆయన చేసిన సేవలు, పోరాటాలు బీసీ సమాజానికి ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని అన్నారు.బీసీ ప్రజలు ఐక్యంగా ఉంటేనే తమ హక్కులు, న్యాయమైన వాటా సాధించుకోవడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఎర్ర సత్యం ముదిరాజ్ చూపిన పోరాట స్ఫూర్తితో బీసీ ప్రజలను ఏకం చేసి, వారి హక్కుల కోసం తెలంగాణ రాజ్యాధికార పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని రవి పటేల్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా నాయకులు, కార్యకర్తలు, ముదిరాజ్ నాయకులు తదితరులు పాల్గొని ఎర్ర సత్యం ముదిరాజ్‌కు ఘన నివాళులు అర్పించారు.

# గురుకులాల్లో క్యాటరింగ్ సేవలకు రీ టెండర్ల ఆహ్వానం

**: డీసీఓ శ్రీనివాస్**

జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లా లోని గురుకుల విద్యాసంస్థల్లో 2026-27 విద్యా సంవత్సరానికి క్యాటరింగ్ సేవల కోసం రీ టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు అధికారులు తెలిపారు. మొండ్రాయి బీ సీ గురుకుల బాలికల పాఠశాలలో చికెన్,మటన్ సరఫరాతో పాటు క్యాటరింగ్ సేవలు, స్టేషన్ ఘన్‌పూర్ బీసీ మహిళా డిగ్రీ కళాశాలలో క్యాటరింగ్ సేవలకు టెండర్లు ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. టెండర్ దరఖాస్తులు ఆగస్టు 12 నుంచి 17వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు స్వీకరిస్తారు. ఆగస్టు 18న ఉదయం 11.30 గంటలకు టెండర్లు తెరవనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు రూ . 1,000 చెల్లించి ధర్మకంచ లోని డీసీఓ కార్యాలయం నుంచి టెండర్ పత్రాలు పొందవచ్చని అధికారులు తెలిపారు. మరిన్ని వివరాలకు జిల్లా కన్వీనర్ డీసీ ఓ శ్రీనివాస్ ఆకులను 9052899229 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

# తిరంగా ర్యాలీ విజయవంతం చేయాలి

*** ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్**



ప్రజాస్ఫూర్తి, భైంసా : స్వాతంత్ర దినోత్సవ సంబరాల్లో భాగంగా గురువారం ఉదయం 10 గంటలకు భైంసా లో భారీ తిరంగా ర్యాలీ జరగనుంది. భైంసా పట్టణంలో ఉదయం వేళ వ్యాపారులు యువకులు, పాఠశాల విద్యార్థులు పెద్ద మొత్తంలో వచ్చి లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయం నుండి బస్టాండ్ వరకు తిరంగా యాత్ర చేపట్టనున్నారు. ప్రతి ఒక్కరి చేతిలో తిరంగా జెండా పట్టుకొని వచ్చి దేశభక్తిని చాటి చెప్పేందుకు సిద్ధమవుతున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ పాల్గొననున్నారు. రాజకీయాలకతీతంగా చేపట్టి తిరంగా ర్యాలీలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు ఊరు ఊరు వాడ వాడల ఘర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని చేపట్టనున్నామన్నారు. యాత్రలో రాజకీయాలకతీతంగా నియోజకవర్గం లోని సర్పంచ్ లు నాయకులు ఉద్యోగులు యువకులు ప్రతి ఒక్కరు పాల్గొనవలసిందిగా ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.

# సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో సిమెంటు బల్లలు వితరణ



ప్రజా స్ఫూర్తి ,కొత్తగూడెం : సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సుజాత నగర్ మండలం, సింగభూపాలెం గ్రామ సెంటర్లో అసోసియేషన్ సభ్యులైనటువంటి సామినేని భాస్కర రావు తల్లిదండ్రులు స్వర్గీయ సామినేని నారాయణ, మంగమ్మ వారి కుమారుడు 20 వేల రూపాయలు విలువైన 5 సిమెంట్ బల్లలు వితరణ చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు కొల్లు నాగేశ్వరరావు మాట్లాడుతూ సింగభూపాలెం గ్రామం తో మాకు చిరకాల అనుబంధం ఉంది అని, అలాగే గ్రామంలో వున్న సీనియర్ సిటిజన్స్ లను అందరినీ గౌరవం గా చూడాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అలాగే వృద్ధులకు ఉపయోగపడే విధంగా ఏర్పాటు చేసిన బల్లలను గ్రామ పంచాయతీ సిబ్బంది జాగ్రత్తగా కాపాడి పదికాలాలపాటు వినియోగించుకోవాలని కోరారు. అనంతరం అంగన్వాడీ టీచర్లు విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకరూప దుస్తులను అంగన్వాడీ విద్యార్థులకు అందజేశారు . ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు బైరి సాంబయ్య , సర్పంచ్ కిన్నెర వెంకన్న,ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# 40వ వార్డులో ఉచిత కంటి వైద్య శిబిరం ప్రారంభం

ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: పేద, మధ్యతరగతి ప్రజలకు ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సేవలు అందించడం అభినందనీయమని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మోరిశెట్టి నివేదిత లక్ష్మీ అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో 40 వ వార్డులో స్థానిక కౌన్సిలర్ కొణతం రాజేష్ రెడ్డి ఆధ్వర్యంలో వాసన్ లేజర్ కంటి ఆసుపత్రి సహకారంతో ఏర్పాటుచేసిన కంటి వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజలు ఆర్థిక ఇబ్బందుల కారణంగా కంటి సమస్యలకు సరైన సమయంలో చికిత్స పొందలేకపోతున్నారని అన్నారు. అలాంటి వారికి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని తెలిపారు. ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు అందించేందుకు ఇలాంటి కార్యక్రమాలను మరింతగా నిర్వహించాలని సూచించారు.

# ప్రస్తుతం గ్లోబల్ మార్కెట్లో సెమికండక్టర్ కి పెరుగుతున్న డిమాండ్




ప్రజా స్ఫూర్తి, పాలేరు: స్థానిక పాన్నేకల్ లోని శ్రీ చైతన్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ & రీసెర్చ్ (ఆటోనమస్)లో, పీసీబీ డిజైన్ హ్యాండ్స్ ఆన్ ట్రైనింగ్ అనే అంశం పై మూడు రోజుల వర్క్ షాప్.ఈ కార్యక్రమంలో ప్రముఖ సెమికండక్టర్ నిపుణులు,రిసోర్స్ పర్సన్ బానుప్రకాష్ ,సీనియర్ టెక్నికల్ హెడ్,అంబ్సెట్ టెకనోవేషన్ హైదరాబాద్ గారు మాట్లాడుతూ భవిష్యత్తు పూర్తిగా సెమికండక్టర్ల ఆధారంగానే ఉండనుందని, అందులో పీసీబీ డిజైన్ కీలక భూమిక వహిస్తుందని అన్నారు.ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డ్ (పి సి బి) డిజైన్కు సంబంధించిన స్కీమాటిక్ క్రియేషన్, లేఅౌట్ డిజైన్, సిమ్యులేషన్, టెస్టింగ్ వంటి ముఖ్య అంశాలను ఇండస్ట్రీ ప్రమాణాల ఆధారంగా హ్యాండ్స్ఆన్ ట్రైనింగ్ ద్వారా విద్యార్థులకు ప్రాక్టికల్ అనుభవం కలిగి ఉండాలి అని అన్నారు.భవిష్యత్తు అంతా సెమికండక్టర్ దే అని ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తదితర రంగాల్లో జరిగే అన్ని సాంకేతిక మార్పులలో సెమికండక్టర్లే కీలక పాత్ర పోషిస్తుంది అని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. జె. లక్ష్మీనారాయణ, మాట్లాడుతూ పి సి బి డిజైన్పై శిక్షణ పొందడం ద్వారా ఎలక్ట్రానిక్స్ మరియు ఎలక్ట్రికల్ విద్యార్థులకు పరిశ్రమ అవసరాలకు తగ్గ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవచ్చు అని, సెమికండక్టర్ మరియు ఎలక్ట్రానిక్స్ రంగాలలో మల్టీ నేషనల్ కంపెనీలలో ఉద్యోగ అవకాశాలను పొందే అవకాశం ఉంటుంది అని ముఖ్యంగా పి సి బి డిజైన్లో ప్రావీణ్యం సంపాదించడం ద్వారా ప్లేస్మెంట్లలో మంచి అవకాశాలు సాధించడానికి విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుంది అని అన్నారు. కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సాయి గీతిక మాట్లాడుతూ విద్యార్థులు నూతన సాంకేతికతలను ప్రాక్టికల్ డిజైన్ నైపుణ్యాలను నేర్చుకోవడం ద్వారా పరిశ్రమ అవసరాలకు తగిన విధంగా తమ ప్రతిభను నిరూపించుకోవడంలోఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. ఈ సి ఈ విభాగధిపతి డాక్టర్ రాజేష్ మాట్లాడుతూ ప్రస్తుతం గ్లోబల్ మార్కెట్లో సెమికండక్టర్ కి పెరుగుతున్న డిమాండ్ కారణంగా ఈ రంగంలో నైపుణ్యం కలిగిన ఇంజినీర్లకు అనేక అవకాశాలు లభిస్తున్నాయని, విద్యార్థులు ఈ రంగంలో ప్రావీణ్యం సాధిస్తే అత్యుత్తమ కెరియర్ ని నిర్మించుకోవచ్చని సూచించారు.ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ డాక్టర్ సుదర్శన్,అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వైశాలి, కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ రాజేష్, డిప్లొమా ఇంచార్జి కృష్ణప్రసాద్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ సుజాత మరియు వివిధ విభాగాల అధిపతులు అధ్యాపక మరియు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థినులకు భరోసా-షీ టీం అవగాహన



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజా స్ఫూర్తి : మహిళలు, విద్యార్థినుల భద్రతపై అవగాహన కల్పించేందుకు భూపాలపల్లి సింగరేణి ఉన్నత పాఠశాలలో భరోసా-షీ టీం ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా షీ టీం ఎస్సై స్వప్న కుమారి విద్యార్థినులకు గుడ్ టచ్-బ్యాడ్ టచ్, స్ట్రీట్ హరాస్మెంట్, మహిళలు, విద్యార్థినుల భద్రత, సోషల్ మీడియా వినియోగం, సైబర్ నేరాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్, వీడియో కాల్స్‌కు స్పందించవద్దని, సోషల్ మీడియాను అప్రమత్తంగా వినియోగించాలని సూచించారు. పాఠశాల పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా, మహిళలు లేదా విద్యార్థినుల భద్రతకు సంబంధించిన సమస్యలు ఎదురైనా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112, సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. మహిళల పట్ల ఎవరైనా అసభ్యంగా లేదా అనుచితంగా ప్రవర్తిస్తే భయపడకుండా షీ టీంకు సమాచారం ఇవ్వాలని, షీ టీం మొబైల్ నంబర్ 8712658162కు ఫిర్యాదు చేయవచ్చని ఎస్సై తెలిపారు. ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచి, నేరస్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. విద్యార్థినులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, తమ చదువుల కోసం తల్లిదండ్రులు పడుతున్న కష్టాన్ని గుర్తించి విద్యపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి ఉన్నత లక్ష్యాలను సాధించాలని స్వప్న కుమారి సూచించారు.కార్యక్రమంలో షీ టీం, భరోసా సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# ప్రజలకు ఇచ్చిన హామీకి కట్టుబడి వృద్ధులతో సహా అందరికీ చేయూత పెన్షన్లు మంజూరు చేయాలి

*** సిపిఐ డిమాండ్**





గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి : అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తాను అధికారంలోకి రావటానికి అర్హులైన అందరికీ పెన్షన్లు ఇస్తామని హామీ ఇచ్చి ఎన్నికలలో గెలిచి ఆ పార్టీ అధికారంలోకి వచ్చి మూడవ సంవత్సరం అవుతున్న నేటికి ఒక్కరికి కూడా కొత్త పెన్షన్ ఇవ్వలేదని ఆగస్టు 15 నాటికి అందరికీ పెన్షన్లు ఇస్తామని దరఖాస్తులు పెట్టుకోమని చెప్పి చివరికి వృద్ధులకు పెన్షన్లు ఇప్పుడు ఇవ్వటం లేదని చెప్పటం ఓటు వేసిన ప్రజలను మోసం చేయడమేనని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోకల వెంకటేశ్వర్లు అన్నారు. సిపిఐ గరిడేపల్లి మండలం సమితి ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయం ముందు అర్హులైన అందరికీ పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేసి అనంతరం మండల పరిషత్ అభివృద్ధి అధికారి సరోజన కి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికైనా తన తప్పిదాన్ని గుర్తించి తాను ఇచ్చిన హామీ మేరకు అర్హులందరికీ పెన్షన్లు ఇచ్చి ఆదుకోవాలని అలాగే అధికారం లోకి రాగానే పెన్షన్ పైసలు డబల్ చేసి ఇస్తామని చెప్పిన దానికి, కట్టుబడి పెన్షన్ పైసలు కూడా పెంచి ఇచ్చి పెన్షన్ దారులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కడియాల అప్పయ్య, ఏఐటియుసి జిల్లా కార్యదర్శి త్రిపురం సుధాకర్ రెడ్డి,సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు ఎడ్ల అంజిరెడ్డి, తిరగమల్ల కిరణ్, చెవ్వా ఎంకన్న, జోన్లగడ్డ తిరుపయ్య, సైదులు, ఎడవల్లి ఎంకన్న, సుభాని,తదితరులు పాల్గొన్నారు

# ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం ఎగరాలి




జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజా స్ఫూర్తి : హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు, రాష్ట్ర అధ్యక్షుడు నారపరాజు రామచంద్రరావు ఆదేశాల మేరకు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో బీజేపీ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా యాత్ర ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిషిధర్ రెడ్డి ఆధ్వర్యంలో భూపాలపల్లి పట్టణంలోని హనుమాన్ టెంపుల్ నుంచి అంబేద్కర్ చౌక్ వరకు యాత్ర సాగింది. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డా. చందుపట్ల కీర్తి రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జాతీయ జెండాలను చేతబూనిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు దేశభక్తి నినాదాలతో ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు. దీంతో పట్టణంలో దేశభక్తి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా డా. చందుపట్ల కీర్తి రెడ్డి మాట్లాడుతూ.. జాతీయ జెండా ప్రతి భారతీయుడి గౌరవానికి ప్రతీక అని అన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో మహనీయులు చేసిన త్యాగాలు, పోరాటాల ఫలితంగానే మనం స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నామని, వారి త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని సూచించారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమం కేవలం ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయడం మాత్రమే కాదని, ప్రతి భారతీయుడి హృదయంలో దేశభక్తి భావాన్ని మరింత బలపరచడమే లక్ష్యమని తెలిపారు. ప్రతి కుటుంబం తమ ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని చాటాలని, జాతీయ జెండాను గౌరవించడం ప్రతి భారతీయుడి బాధ్యత అని పేర్కొన్నారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములై విజయవంతం చేయాలని, ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని దేశభక్తి స్ఫూర్తితో ఘనంగా నిర్వహించాలని డా. కీర్తి రెడ్డి పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లింగంపల్లి ప్రసాదరావు, జన్నె మొగిలి, ఎరుకల గణపతి, మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, నాలుగో వార్డు కౌన్సిలర్ కన్నం యుగదీశ్వర్, జిల్లా ప్రధాన కార్యదర్శులు దొంగల రాజేందర్, పెండ్యాల రాజు, అర్బన్ అధ్యక్షుడు సంపత్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సేనాపతి, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దుప్పటి భద్రయ్య, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దేశెట్టి గోపాల్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సయ్యద్ గాలిఫ్, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రాజనాయక్, లీగల్ సెల్ కన్వీనర్ చీర్ల అశోక్‌రెడ్డి, ఎండోమెంట్ కన్వీనర్ జయపాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు సామల మధుసూదన్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి శివరాత్రి వేణుతో పాటు రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, బూత్ అధ్యక్షులు, బీజేపీ కార్యకర్తలు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఐసిఐసిఐ బ్యాంక్, వివేక వర్ధిని డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో వాక్ ఇన్ డ్రైవ్



ప్రజాస్ఫూర్తి , కొత్తగూడెం : లక్ష్మీదేవిపల్లి లోని వివేక వర్ధిని డిగ్రీ అండ్ పిజి కళాశాల ఐసిఐసిఐ బ్యాంక్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం సేల్స్ అండ్ రిలేషన్ షిప్ మేనేజర్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ఉద్యోగాల కొరకై వాక్ ఇన్ డ్రైవ్ ఏర్పాటు చెయ్యటం జరుగుతుందని కళాశాల ప్రిన్సిపల్ సతీష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభ్యర్థులకు వయస్సు 25 సం" లోపు , డిగ్రీ 50% మార్కులతో పాస్ అయినవారు, ఎలాంటి మార్కెటింగ్ అనుభవం లేని వారు ఈ ఉద్యోగాలకు అర్హులు అని , ఎంపికైన వారికి 15 రోజుల శిక్షణ కార్యక్రమం ఉంటుందని ఆసక్తి గల వారు తమ కళాశాలలో ఉదయం 9:30 గంటలకు బయోడేటా తో రావాలని ఆయన సూచిస్తూ , పూర్తి వివరాలకు కళాశాల ప్లేస్మెంట్ అధికారిణి బి. ఉమ 9866704423 నెంబర్ ను సంప్రదించవచ్చని ఆయన అన్నారు .

## ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కు నివాళులర్పించిన కలెక్టర్, ఎమ్మెల్యే లు



ప్రజాస్ఫూర్తి, ఖమ్మం జిల్లా : విద్యుత్ తీగలు తగిలి ప్రమాదవశాత్తూ మృతి చెందిన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ బానోతు నవీన్ నాయక్ మృతదేహానికి పలువురు ఉన్నత అధికారులు, నాయకులు నివాళులర్పించారు.సింగరేణి మండల పరిధిలోని వెంకిటియ తండాలో బుధవారం నవీన్ అంత్యక్రియలు జరిగాయి. ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్ ఎస్ తోపాటు అటవీశాఖ ఉన్నత అధికారులు, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, భద్రాద్రి కొత్తగూడెం డిఎఫ్ఓ సిద్దార్ధ విక్రమ్ సింగ్ పలువురు ప్రజాప్రతినిధులు నవీన్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ నవీన్ కుటుంబాన్ని ప్రభుత్వం తరుపునా అండహ ఉంటామని తెలిపారు. నవీన్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని కలెక్టర్ తో పాటు అధికారులు ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చారు. మృతుడు నవీన్ కు భార్య కుమార్తె కుమారుడు ఉన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలి

*** జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**



ప్రజాస్ఫూర్తి, ఖమ్మం జిల్లా : ప్రభుత్వం పేద కుటుంబాలకు గౌరవప్రదమైన జీవనాన్ని అందించాలనే లక్ష్యంతో అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకొని తమ సొంతింటి కలను సాకారం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. బుధవారం ఖమ్మం నగర పరిధిలోని వెలుగుమట్ల ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో సందర్శించి నిర్మాణ పనులను తనిఖీ చేశారు. ఇంటి నిర్మాణాలు చేపడుతున్న లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలు, నిర్మాణ దశల వివరాలను తెలుసుకున్నారు. నిర్మాణ పనుల్లో ఎదురవుతున్న ఇబ్బందులపై ఆరా తీసి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య లతో కలిసి ఇండ్లు ఇండ్లు క్షేత్రస్థాయిలో తిరుగుతూ నిర్మాణ దశలో ఉన్న ఇళ్లను ఒక్కొక్కటిగా పునాదుల నిర్మాణం, గోడల నిర్మాణం, స్లాబ్ పనులు, పైకప్పు పనులు, తుదిదశ పనుల పురోగతిని పరిశీలించారు. ప్రతి ఇంటి నిర్మాణం నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా అధికారులు పర్యవేక్షించాలని, లబ్ధిదారులకు అవసరమైన సాంకేతిక సూచనలు అందిస్తూ నిర్మాణాలు వేగంగా పూర్తయ్యేలా సహకరించాలని హౌసింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ తనిఖీ సందర్భంగా హౌజింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, ఖమ్మం అర్బన్ తహసీల్దారు జయచంద్ర, ఈఈ జగ్గారావు, హౌసింగ్ ఏఈలు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి

* **రంగారెడ్డి జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కొమ్ము కృష్ణ**
* **నందిగామ గ్రామంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ**




ప్రజా స్ఫూర్తి షాద్నగర్ నందిగామ గ్రామంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో దేశభక్తి పూరితంగా జరిగింది. రంగారెడ్డి జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కొమ్ము కృష్ణ మరియు ఉప సర్పంచ్ సారా వెంకటేష్ గౌడ్ ల నేతృత్వంలో గ్రామ వీధుల్లో జాతీయ జెండాలతో భారీ ర్యాలీ నిర్వహించారు ర్యాలీలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు నాయకులు వార్డు సభ్యులు మరియు గ్రామస్తులు పాఠశాల విద్యార్థులతో చేతుల్లో త్రివర్ణ పతాకాలను పట్టుకుని భారత్ మాతా కీ జై వందేమాతరం అంటూ చేసిన నినాదాలతో నందిగామ గ్రామం మారుమోగింది. ఈ సందర్భంగా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కొమ్ము కృష్ణ మాట్లాడుతూ.. భారత స్వాతంత్ర్య స్ఫూర్తిని త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై గౌరవప్రదంగా జాతీయ జెండాను ఎగురవేయాలని కోరారు దేశభక్తిని చాటుకోవడంలో నందిగామ గ్రామం ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సారా వెంకటేష్ గౌడ్, వార్డు సభ్యులు నరసింహ, అగ్గి సురేశ్ బి. కృష్ణ యాదవ్, ప్రవీణ్ రెడ్డి, జాగాయ, అగ్గి ప్రవీణ్, శ్రీశైలం, యాదవ్ , స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేశారు.

# రైతు పొలాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: ఒకే రకం పంట వేసి నష్టపోకుండా విభిన్న రకాల పంటలు సాగు చేస్తూ లాభాలు గడిస్తున్న రైతును జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ప్రత్యేకంగా అభినందించారు. స్థానిక రైతు పాశం వెంకటరెడ్డి పొలాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పొలంలో సాగు చేస్తున్న పంటల వివరాలను, అనుసరిస్తున్న పద్ధతులను కలెక్టర్ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. వెంకటరెడ్డి తనకున్న రెండు ఎకరాల భూమిలో ఒకే రకం పంటపై ఆధారపడకుండా బీర, మిర్చి, బంతి, బెండ, దోస వంటి ఆరు రకాల పంటలను సాగు చేస్తున్నట్లు తెలిపారు. పంట దిగుబడి, మార్కెటింగ్ వివరాలను రైతు కలెక్టర్‌కు వివరించారు. 30 గుంటల్లో వేసిన మిర్చి పంట ద్వారా దాదాపు 10 టన్నులు, బీర ద్వారా 4 టన్నులు, బంతి పూల ద్వారా టన్నున్నర నుంచి 2 టన్నులు, అలాగే బెండ, దోస సాగు ద్వారా మరో టన్ను వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఒకే పంట వేసి నష్టపోయే కంటే, ఇలా విభిన్న పంటలు వేయడం ద్వారా నిరంతరం ఆదాయం పొందవచ్చని వెల్లడించారు. రైతు ఆదర్శవంతమైన సాగు పద్ధతులను కలెక్టర్ అభినందించారు. అదేవిధంగా శ్రీనివాస్ పురం గ్రామానికి చెందిన పారుపల్లి శ్రీనివాసరావు (శ్రీ శ్రీ) సంపూర్ణ సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తున్న ఐదు ఎకరాల డ్రాగన్ తోటను కూడా పరిశీలించారు. రైతుతో మాట్లాడి పంట దిగుబడి అంతర్గత పంటల గురించి తెలుసుకున్నారు. అంతర్గత పంటలు వేయడం ద్వారా అధిక లాభాలను పొందవచ్చని కలెక్టర్ రైతుకు సూచించారు. దీంతోపాటు గట్ల వెంట వివిధ రకాల చెట్లను నాటి వాటి ద్వారా ఆదాయాన్ని పెంపొందించు కోవచ్చని అన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, ఏడి ఏ రవి, ఎంఏఓ స్వర్ణ, తహసిల్దార్ కవిత, మున్సిపల్ కమిషనర్ సతీష్ కుమార్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు

# మహబూబాబాద్ జిల్లా మహిళా అధ్యక్షురాలుగా గండి శారద గౌడ్ నియామకం



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి; తెలంగాణ గౌడ సంక్షేమ సంఘం మహబూబాబాద్ జిల్లా అధ్యక్షురాలుగా గండి శారద గౌడ్ నియమితులయ్యారు.ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని తెలంగాణ గౌడ సంక్షేమ సంఘం కేంద్ర కార్యాలయంలో వ్యవస్థాపక అధ్యక్షులు గట్టు రామచంద్ర రావు చేతుల మీదుగా గండి శారద గౌడ్ నియామక పత్రాన్ని అందుకున్నారు. నియామక పత్రం అందుకున్న అనంతరం గండి శారద గౌడ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన ఈ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ,మహిళా జాతి అభ్యున్నతి, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. గౌడ సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి,వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. అలాగే గౌడ యువతులకు విద్య, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు, సామాజికంగా, రాజకీయ,ఆర్థికంగా గౌడ మహిళ సమాజం అభివృద్ధి చెందేలా కృషి చేస్తానని శారద గౌడ్ తెలిపారు.తనకు మహిళా జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన తెలంగాణ గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపకులు గట్టు రామచంద్ర రావు,రాష్ట్ర అధ్యక్షుడు గుండాల మల్లేష్ గౌడ్,యువజన అధ్యక్షుడు మల్కాపురి శ్రీకాంత్ గౌడ్,జిల్లా అధ్యక్షులు గండి వీరేందర్ గౌడ్, రాష్ట,జిల్లా గౌడ సంఘం పెద్దలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ఘనంగా బిఆర్ఎస్ నాయకులు కూసాన వీరభద్రం జన్మదిన వేడుకలు

ప్రజాస్ఫూర్తి ,కొత్తగూడెం : చుంచుపల్లి మండల పరిధిలోని బాబు క్యాంప్ గ్రామ మాజీ ఎంపీటీసీ , టీబీజీకేఎస్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ , బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కూసాన వీరభద్రం 64వ జన్మదిన వేడుకలను వారి స్వగృహం నందు ఘనంగా నిర్వహించారు . పలువురు నాయకులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు . ఈ సందర్భంగా అతిధులు మాట్లాడుతూ ఇలాంటి జన్మదిన వేడుకలను ఎన్నో జరుపుకోవాలని , కుటుంబ సమేతంగా సుఖసంతోషాలతో ఆరోగ్యంగా ఉండాలని వారు ఆకాంక్షిస్తూ , పుష్పగుచ్చాలు అందజేస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు . ఈ కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులతో పాటు అతిథులు పాల్గొన్నారు .

# రైతులు సమగ్ర వ్యవసాయ విధానాల పై దృష్టి సారించాలి

* **జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా.**



జనగామ, ప్రజాస్ఫూర్తి : రైతులు నీటి వనరులను సమర్థంగా వినియోగించు కుంటూ పంటల వైవిధ్యీకరణపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. బుధవారం స్టేషన్ ఘనపూర్ మండలం ఛాగల్ గ్రా మంలో రైతుల వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించి, పంటల సాగు విధానం, నీ టి లభ్యత, ఫార్మ్ పాండ్స్, డ్రిప్ ఇరిగేష న్, ప్రత్యామ్నాయ పంటలు, మార్కెటిం గ్ అవకాశాలపై రైతులతో మాట్లాడారు.వర్షపు నీటిని నిల్వ చేసుకునేందుకు ఫార్మ్ పాండ్స్ నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో నిర్దేశించిన 1,500 ఫార్మ్ పాం డ్స్ లక్ష్యాన్ని సాధించేలా రైతులను చై తన్యపరచాలన్నారు. ప్రతి చుక్క నీటి ని సమర్థంగా వినియోగించుకునేందు కు డ్రిప్ ఇరిగేషన్‌ను ప్రోత్సహించాలని సూచించారు. రైతు చిక్కుల్ల రమేష్ సా గు చేస్తున్న కంది పంటను పరిశీలించిన కలెక్టర్, ప్రభుత్వ పథకాలు, రాయితీలు, ఆధునిక వ్యవసాయ సాంకేతికతను రైతులు వినియోగించుకోవాలని సూచించారు. సంప్రదాయ పంటల తోపాటు మార్కెటింగ్‌కు అనుకూలమైన ప్రత్యా మ్నాయ పంటలు, ఆయిల్‌పామ్ సాగు వైపు రైతులను ప్రోత్సహించాలని వ్యవ సాయ అధికారులను ఆదేశించారు. ప త్తి, కంది పంటలను పరిశీలించిన సంద ర్భంగా పంటల మధ్య సరైన దూరం, క లుపు నివారణ, తెగుళ్లు-పురుగుల ని యంత్రణపై రైతులతో చర్చించారు. దెం చా వంటి పచ్చిరొట్ట పంటల సాగు లో భాగంగా ఉపయోగించడం ద్వారా భూ సారాన్ని మెరుగుపరుచుకోవచ్చని తెలి పారు. రైతు చాదరబోయిన వెంకన్నకు చెందిన భూమిని పరిశీలించిన కలెక్టర్, బోరు ద్వారా సాగునీటి లభ్యతపై వివ రాలు అడిగి తెలుసుకున్నారు. భూగర్భ జలమట్టం తగ్గుతున్న నేపథ్యంలో అం దుబాటులో ఉన్న నీటికి అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకు నేందుకు పంటల వైవిధ్యీకరణ,నీటి సం రక్షణ, సూక్ష్మ సాగునీటి పద్ధతులు,మా ర్కెటింగ్‌కు అనుకూలమైన పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. కార్య క్రమంలో డీఏఓ అంబికా సోనీ, డీఆర్డీఓ భాస్కర్, కేవీకే శాస్త్రవేత్త రమ్య, ఉద్యాన వన శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ పారదర్శకంగా 'చేయూత' పింఛన్లు అందించాలి

* **జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా**




ప్రజాస్ఫూర్తి, బైంసా : రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'చేయూత' పింఛన్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పారదర్శకంగా, వేగవంతంగా పింఛన్లు అందేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్త చేయూత పింఛన్ల దరఖాస్తుల స్వీకరణ, ఆన్‌లైన్ నమోదు, అర్హతల పరిశీలనతో పాటు ఇందిరమ్మ ఇండ్లు, వనమహోత్సవం, తెలంగాణ జలసిరి కార్యక్రమాల అమలు పురోగతిపై సమీక్ష నిర్వహించి అధికారులకు కలెక్టర్ పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.కొత్త చేయూత పింఛన్ల కోసం ఆగస్టు 31వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమం చేరేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు. అందిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు.గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ దరఖాస్తులను గ్రామ పంచాయతీ కార్యదర్శి లేదా ఎంపీడీవో కార్యాలయంలో, పట్టణ ప్రాంతాల ప్రజలు మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు.జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను ఎక్కడా పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే ప్రారంభించి, నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మండలాల వారీగా ఇండ్ల నిర్మాణ పురోగతిని సమీక్షించి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. వనమహోత్సవం కార్యక్రమంలో నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా మొక్కలు నాటి వాటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. తెలంగాణ జలసిరి పథకం కింద సోక్ పిట్లు, బోర్‌వెల్లు, ఫామ్ పాండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.జిల్లాలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నియంత్రించేందుకు కఠిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు విస్తృత అవగాహన కల్పించడంతో పాటు నిషేధిత ప్లాస్టిక్ విక్రయాలు గుర్తించిన దుకాణాలను సీజ్ చేయాలనీ, భారీ జరిమానాలు విధించాలని ఆదేశించారు. జిల్లాను ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, డీఆర్డీవో విజయలక్ష్మి, డీపీవో శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్లు రవిబాబు, సుందర్ సింగ్, వివిధ మండలాల ఎంపీడీవోలు, ఎంపీవోలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ ప్రభుత్వం పేద మధ్య తరగతి ప్రజల పొట్టగొట్టి కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతుంది




గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి : ఎమ్మెస్ భవన్ గరిడేపల్లి లో సిఐటియు జనరల్ బాడీ సమావేశం మచ్చ వీరస్వామి అధ్యక్షతన జరిగినది ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఎస్.కె యాకూబ్ మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వచ్చిన నాటి నుండి పేద మధ్య తరగతి ప్రజల పొట్టగొట్టి కార్పొరేట్ శక్తులకు దోచి పెడుతుందని అన్నారు ఒకే దేశం ఒకే పన్ను అని జివిస్టి తెచ్చి ప్రతి సరుకు మీద పన్ను విధించారు కానీ పెద్దవాళ్లకు లక్షల కోట్ల రాయితీలు ఇస్తూ మనకు మాత్రం తినే తిండి మీద ఉప్పు పప్పు నూనె కూరగాయలు మీద పండ్లు పేస్టు మీద పడుకునే మంచం మీద చదువుకునే పుస్తకాల మీద పసి పిల్లలకు వేసే పాలు ప్యాకెట్ మీద కూడా దయాదక్షణ లేకుండా పన్నులు వేసి సామాన్యుల విన్ను ఇస్తున్నారని అన్నారు చాయి బండి కూరగాయల బండి అన్న తేడా లేకుండా శివకీలపై కూడా జీఎస్టీ పన్ను బాధతోనే కేంద్ర ప్రభుత్వాన్ని 12 సంవత్సరాలుగా ప్రజలు పోయటం బాధాకరమని అన్నారు దేశంలో పేదరికం తగ్గిందని 25 కోట్ల మందిని దరిద్ర రేఖ నుండి పైకి తెచ్చామని చెప్తున్న ఈ కేంద్ర ప్రభుత్వం 81 కోట్ల మందికి రేషన్ బియ్యం పంపిణీ చేసిన ఏందని అన్నారు బియ్యం పంపిణీ చేయాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందని అన్నారు కార్మిక వర్గాలను దెబ్బతీసిన ప్రభుత్వాలు చాలా కాలం అధికారంలో కొనసాగలేవని అన్నారు భవిష్యత్తులో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా తెచ్చిన చట్టాలపై ప్రజలందరూ తిరుగుబాటుకు సన్నతమవుతున్నారని అన్నారు ఈ కార్యక్రమంలో నిమ్మల సత్యనారాయణ, జొన్నల గోవర్ధన, వీరయ్య ,చవ్వాజి సిద్దయ్య , బుద్ధి తిరపయ్య, చెరుకుపల్లి సాంబయ్య, సినపొంగు మట్టయ్య, మచ్చ వీరస్వామి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# జగద్గిరిగుట్ట లో ఘనంగా హర్ ఘర్ తిరంగా భారీ ర్యాలీ






జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు బుధవారం బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు జే.కే. శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో శ్రీనివాస్ నగర్ నవోదయ స్కూల్ నుంచి చైతన్య స్కూల్ మీదుగా జగద్గిరిగుట్ట లాస్ట్ బస్ స్టాప్ వరకు సుమారు 2,000 మంది విద్యార్థులు, నాయకులు, కార్యకర్తలతో హర్ ఘర్ తిరంగా భారీ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాతీయ జెండాలతో దేశభక్తిని చాటుతూ ర్యాలీ ఉత్సాహంగా సాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఓబీసీ రాష్ట్ర అధ్యక్షులు జి.అనంద్ గౌడ్, మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లారెడ్డి, జిల్లా అధ్యక్షులు గిరివర్ధన్ రెడ్డి, నందనం దివాకర్ లు పాల్గొని హర్ ఘర్ తిరంగా ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆగస్టు 15 రోజు ప్రతి ఇంటిపై జాతీయ భావం పెంపొందించే విధంగా ప్రతి ఒక్కరు తమ ఇంటి పై జాతీయ జెండాను ఎగరావేయాలన్నారు. ఈ కార్యక్రమంలో విగ్నేష్‌చారి, వాసు, సుధ, భరత్ సింహారెడ్డి, సురేష్ రెడ్డి, సిద్ధిరాం రెడ్డి, ఓబీసీ మోర్చా నాయకులు సతీష్ గౌడ్, విద్యాసాగర్, రమేష్, రవి యాదవ్, రమేష్ యాదవ్, రంగ శ్రీనివాస్ గౌడ్, రాజు యాదవ్, నాగరాజు యాదవ్, కుమార్ యాదవ్, మార్చాల శ్రీనివాస్, వసుంధర, రేణుక, తేజస్విని, సబిత, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

# కేజీవిబి పాఠశాల ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి, ఆజీవిక యోజనా పథకం అమలు తీరును పరిశీలించిన కలెక్టర్ రైతులు ఆర్థికంగా బలోపేతం కావాలనే లక్ష్యంతో 10 రకాల కూరగాయల విత్తనాల (సీడ్స్) కిట్లను (752) మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని నాణ్యమైన పంటలు పండించాలని సూచించారు. సీడ్స్ వేసిన విధానం స్వయంగా పరిశీలించి వారి యొక్క ఆర్థిక సామాజిక స్థితిగతులను స్వయంగా పరిశీలించి వారితో మాట్లాడారు. స్థానిక రైతుల సామాజిక, ఆర్థిక పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. (డిఆర్డిఏ) ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో వేగవంతంగా జరుగుతున్న 'ఫార్మ్ పాంట్' (రైతు కుంటల) పనులను తనిఖీ చేసి, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.మండల పరిధిలో అర్హులైన వివిధ పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు అందుతున్న పింఛన్ల పంపిణీ,తదితర అంశాలను తీరును పరిశీలించి,ఏ ఒక్క అర్హుడికి సంక్షేమ పథకాలు దూరం కాకూడదని స్పష్టం చేశారు.కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని అకస్మాత్తుగా తనిఖీ చేసిన కలెక్టర్, విద్యార్థినులకు అందుతున్న విద్యాబోధన, భోజన వసతి, మరియు పారిశుధ్య పరిస్థితులను స్వయంగా పరిశీలించారు. విద్యార్థినుల భద్రత, ఆరోగ్యం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని పాఠశాల సిబ్బందిని ఆదేశించారు, ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట డి ఆర్ డి ఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, ప్రత్యేక అధికారి వెంకటరమణ, ఉద్యానవన శాఖ అధికారి జి.మరియాన్న ఎమ్మార్వో బాలకృష్ణ, ఎంపీడీవో వైష్ణవి, ఆస్పిరేషనల్ బ్లాక్ అధికారి శ్రీనాథ్, సంబంధిత అధికారులు, రైతులు ఉన్నారు.

# చేపల పెంపకంతో మహిళా సంఘాలకు అదనపు ఆదాయం

**కలెక్టర్ కె.హరిత**



కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా,ప్రజా స్ఫూర్తి: స్వయం సహాయక సంఘాల మహిళలు చేపల పెంపకం, డెయిరీ ఫాంల ఏర్పాటు వంటి ఉపాధి మార్గాలను సద్వినియోగం చేసుకుని అదనపు ఆదాయం పొందాలని కలెక్టర్ కె.హరిత సూచించారు. మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను వినియోగించుకోవాలని ఆమె అన్నారు. లింగాపూర్ మండలం జాముల్‌ధర గ్రామంలో ప్రధానమంత్రి కృషి సించాయి యోజనలోని వాటర్‌షెడ్ డెవలప్‌మెంట్ కాంపోనెంట్ కింద గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పంట కుంటలు, ఊట కుంటల్లో స్వయం సహాయక సంఘాల మహిళలను అనుసంధానం చేస్తూ చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. ప్రత్యేక కమిషనర్ శ్రీలక్ష్మి, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మెత విశ్వనాథ్‌లతో కలిసి కలెక్టర్ కె.హరిత చేప పిల్లలను కుంటల్లో వదిలారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో లోటు వర్షపాతం నమోదవుతున్న నేపథ్యంలో వర్షపు నీటిని సమర్థవంతంగా ఒడిసి పట్టుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భూగర్భ జలమట్టం పెంపునకు ఇంకుడు గుంతలు, ఊట కుంటలు, పంట కుంటలను పెద్ద ఎత్తున నిర్మించాలని సూచించారు. కుంటల్లో నీటిని నిల్వ చేయడం ద్వారా భూగర్భ జలమట్టం పెరగడంతో పాటు చేపల పెంపకం ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలకు అదనపు ఆదాయం సమకూరుతుందని తెలిపారు. ఊట కుంటలు, పంట కుంటల నిర్మాణాలను విస్తృతంగా చేపట్టడం ద్వారా అర్హులైన కూలీలకు ఉపాధి, పని దినాలు లభిస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు చేపల పెంపకం వంటి కార్యక్రమాల్లో చురుగ్గా భాగస్వాములు కావాలని కోరారు. మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు.

**మహిళలు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి**

ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ మహిళల అభివృద్ధి, ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలు ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని వివిధ రంగాల్లో రాణించాలని సూచించారు. ప్రతి మహిళ స్వయం సహాయక సంఘంలో చేరి సంఘటితంగా ఆర్థికంగా బలోపేతం కావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, సర్పంచులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్.ఐ.ఆర్. ప్రక్రియలో తదుపరి దశకు సన్నద్ధం కావాలి.. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



ప్రజాస్ఫూర్తి, ఖమ్మం జిల్లా : స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ఖమ్మం జిల్లాలో తొలి దశను విజయవంతంగా పూర్తి చేశామని, ఎస్ఐఆర్ ప్రక్రియలో సహకరించిన ప్రజలు, బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు), అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, మీడియా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ ఎస్.ఐ.ఆర్. తదుపరి దశకు సన్నద్ధం కావాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్ఐఆర్ ప్రక్రియపై మీడియాతో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఎస్ఐఆర్ షెడ్యూల్‌ను రెండు పర్యాయాలు పొడిగించిందని తెలిపారు. ప్రస్తుతం తొలి దశ ప్రక్రియ పూర్తయిందని, తదుపరి దశకు జిల్లా యంత్రాంగం సన్నద్ధంగా ఉందని చెప్పారు. ఆగస్టు 17న ముసాయిదా ఓటరు జాబితాను ప్రచురించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 16 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలను స్వీకరిస్తామని, ఆగస్టు 17 నుంచి అక్టోబర్ 15 వరకు వాటిని పరిష్కరిస్తామని చెప్పారు. అక్టోబర్ 19న తుది ఓటరు జాబితాను ప్రచురించనున్నట్లు వెల్లడించారు.

*** 10 లక్షల 85 వేల 927 ఎన్యూమరేషన్ ఫారాలు డిజిటలైజేషన్**

ఖమ్మం జిల్లాలో మొత్తం 10,85,927 ఎన్యూమరేషన్ ఫారాలు (87.31 శాతం) మేర డిజిటలైజేషన్ పూర్తయిందని తెలిపారు. సేకరించిన ఫారాల్లో 43,131 మంది మ్యాపింగ్ చేయబడలేదని, వీరికి నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేస్తామని చెప్పారు. నోటీసులు అందుకున్న వారు ఎన్నికల సంఘం సూచించిన 11 రకాల ధృవపత్రాల్లో నిబంధనలకు అనుగుణంగా తగిన ధృవపత్రాన్ని సమర్పించాలని కలెక్టర్ సూచించారు. అవసరమైన ధృవపత్రాలు అందుబాటులో లేని వారు దరఖాస్తు చేసుకోవాలని, వారికి అవసరమైన ధృవ పత్రాలను వీలైనంత త్వరగా అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

*** ఎస్.ఐ.ఆర్. డేటాలో 1,32,736 అనామలీస్ గుర్తింపు**

జిల్లాలో 1,32,736 అనామలీస్ గుర్తించినట్లు కలెక్టర్ తెలిపారు. ఇది మొత్తం ఫారాల్లో 10.67 శాతం అని చెప్పారు. పేర్ల స్పెల్లింగ్‌లో తేడాలు, తల్లిదండ్రులు-పిల్లల మధ్య వయస్సు వ్యత్యాసం 15 సంవత్సరాల కంటే తక్కువగా ఉండటం తదితర కారణాలతో అనామలీస్ గుర్తించినట్లు తెలిపారు. వీటిని కేవలం డేటాలోని లోపాలుగా పరిగణించకుండా, క్షేత్ర స్థాయిలో విచారణ నిర్వహించి వాస్తవాలను నిర్ధారించిన అనంతరం అవసరమైన సవరణలు చేపడతామని తెలిపారు.

*** 1,57,854 మంది ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించలేదు**

జిల్లాలో 1,57,854 మంది ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారాలను తిరిగి సమర్పించలేదని కలెక్టర్ తెలిపారు. వీరిపై క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించామని చెప్పారు. క్షేత్రస్థాయి విచారణలో 33,380 మంది మరణించిన ఓటర్లు, 11,004 మంది డబుల్ ఓటర్లు, సుమారు 1,01,000 మంది శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలివెళ్లిన ఓటర్లు ఉన్నట్లు గుర్తించామని తెలిపారు.

*** ఫారం సమర్పించని అర్హులైన ఓటర్లకు మరో అవకాశం**

ఎన్యూమరేషన్ ఫారం సమర్పించని అర్హులైన ఓటర్లకు ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 16వరకు మరో అవకాశం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ఇతర ప్రాంతంలో తనకు ఓటు హక్కు లేదని ప్రకటిస్తూ అవసరమైన డిక్లరేషన్‌తో పాటు సంబంధిత వివరాలు, ధృవపత్రాలను సమర్పించవచ్చని చెప్పారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.అదేవిధంగా కొత్తగా ఓటరుగా నమోదు కావాలనుకునే అర్హులైన పౌరులు ఫారం6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పుట్టిన తేదీకి అనుగుణంగా ఎన్నికల సంఘం సూచించిన ధృవపత్రాలను సమర్పించాల్సి ఉంటుందని చెప్పారు.

*** నోటీసులు అందుకున్న వారు ఆధారాలను సమర్పించాలి**

*** జనన తేదీ ఆధారంగా ధృవపత్రాల సమర్పణ**

భారతదేశంలో 1987జులై 1కు ముందు జన్మించిన వారు తమ స్వీయ గుర్తింపు లేదా జనన పత్రాలు నిర్ధారించే ధృవ పత్రాల్లో ఏదైనా ఒకదాన్ని సమర్పించాల్సి ఉంటుందని, 1987 జూలై 1 నుంచి 2004 డిసెంబర్ 2 మధ్య జన్మించిన వారు తమ పత్రాలతో పాటు తల్లిదండ్రులలో ఎవరిదైనా ఒకరి ధృవ పత్రాన్ని సమర్పించాల్సి ఉంటుందని, 2004 డిసెంబర్ 2 తర్వాత జన్మించిన వారు తమ పత్రాలతో పాటు తల్లిదండ్రులిద్దరి పత్రాలు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. ఎన్నికల సంఘం సూచించిన 11 రకాల ధృవ పత్రాలలో నిబంధనలకు అనుగుణంగా ఏదైనా ఒకదాన్ని సమర్పించవచ్చని కలెక్టర్ తెలిపారు.


*** క్లెయిమ్స్, అభ్యంతరాలపై విచారణ అనంతరం నిర్ణయం**

ఈఆర్ఓలు తీసుకున్న నిర్ణయంపై నిబంధనల ప్రకారం అక్టోబర్ 15 వరకు అప్పీల్ చేసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. ప్రజలు తమకు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఓటరు జాబితాలో తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

*** ఎస్ఐఆర్‌పై ప్రజలకు అవగాహన కల్పించడంలో మీడియా సహకరించాలి**

ఈ మీడియా సమావేశంలో కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ పర్యవేక్షకులు రాజు, డిటి అన్సారీ, సంబంధిత అధికారులు, మీడియా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# నేడు కేపీహెచ్బీ లో ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ



కూకట్ పల్లి ప్రజాస్ఫూర్తి : నేడు సాయంత్రం 4:00 గంటలకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , హౌసింగ్ శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి , గోకుల్ ప్లాట్స్ - సాయి హిల్స్ సమీపంలోని కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు స్థలంలో నిర్వహించనున్న ఇందిరమ్మ ఇళ్ల భూమి పూజ కార్యక్రమంలో పాల్గొననున్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని చైర్మన్ రఘునాథ్ యాదవ్ పిలుపునిచ్చారు.

# జాప్యం లేకుండా పెండింగ్ లో ఉన్న అక్రిడేషన్లు మంజూరు చేయండి

*** టి జే ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ డిమాండ్**



ప్రజాస్ఫూర్తి, ఖమ్మం జిల్లా : గతంలో మాదిరిగా ఖమ్మం జిల్లాలో అర్హులైన జర్నలిస్టులందరికీ యధావిధిగా అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టి జె ఎఫ్) జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ డిమాండ్ చేశారు. అక్రిడేషన్ కార్డుల జారీ ప్రక్రియలో ఎటువంటి జాప్యం లేకుండా తక్షణమే అక్రిడేషన్ కమిటీ సమావేశం ఏర్పాటు చేసి అర్హులైన జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ కు టి యు డబ్ల్యూ జే (టి జే ఎఫ్) జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి చిర్రా రవి ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. పెద్ద, మీడియం, చిన్న పత్రికలు, చానళ్లు, ఇండిపెండెంట్ జర్నలిస్టులకు జిల్లా కేంద్రాలలో, మున్సిపాలిటీ కేంద్రాలలో ఉన్న రిపోర్టర్లకు కార్డులు తగ్గించటం వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారందరికీ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో మాదిరిగానే ప్రస్తుతం నియోజకవర్గాల ఇన్చార్జిలకు జిల్లా కార్డులు ఇవ్వాలని, వారికి రాష్ట్రస్థాయి బస్సు పాసుల సౌకర్యం కల్పించాలని కోరారు. ఎంప్యానల్ ఉన్న కేబుల్ ఛానల్ కు వెంటనే అక్రిడేషన్ కార్డులు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కు వివరించారు. పెండింగ్ లో ఉన్న అక్రిడేషన్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనికి కలెక్టర్ స్పందిస్తూ తక్షణమే అక్రిడేషన్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేసి అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ కార్డులు వచ్చే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని డి పి ఆర్ ఓ గౌస్ ను ఆదేశించారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టి యు డబ్ల్యూ జె టిజెఎఫ్ జాతీయ కౌన్సిల్ సభ్యులు వెన్న బోయిన సాంబశివరావు, జిల్లా ఉపాధ్యక్షులు బొల్లం శ్రీనివాస్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రధాన కార్యదర్శి శెట్టి రజినీకాంత్ , యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు ప్రశాంత్ రెడ్డి, భాస్కర్, మందుల ఉపేందర్, హరీష్, మందటి రమణ, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు, సీనియర్ జర్నలిస్ట్ రామి శెట్టి విజేత, అడపాల నాగేందర్, శాస్త్రి, ఫోటోగ్రాఫర్ రాజు, కెమెరామెన్ అసోసియేషన్ అధ్యక్షులు నాగరాజు, అమరవరపు కోటేశ్వరరావు, ఎస్వీ రెడ్డి, రేపాక యాదగిరి, ఉల్లోజు రమేష్, నల్లమోతు శ్రీనివాస్, గోవిందు, రోసి రెడ్డి,ఇసంపల్లి వెంకటేశ్వర్లు, బంక రవిబాబు,మాధవి, కిరణ్మయి, పెంటి వెంకటేశ్వర్లు, మోహన్, సాయి, గౌరీ శంకర్, పాశం వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి కి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు పథకాలు పకడ్బందీగా అమలు కావాలి





ప్రజాస్ఫూర్తి, నల్లగొండ : షెడ్యూల్డ్ కులాలు షెడ్యూల్ తెగల వారి అభివృద్ధికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు పథకాలు పకడ్బందీగా అమలు కావాలని రాష్ట్ర షెడ్యూల్డ్ కులాలు , షెడ్యూల్డ్ తెగల కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. బుధవారం ఆయన కమిషన్ సభ్యులతో కలిసి నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని ఉదయాదిత్య భవన్లో జిల్లాలోని ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన భూముల సమస్యలు, దాడుల కేసులు, ఉద్యోగాలలో ఎస్సీ ,ఎస్టీ రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు, తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు.వివిధ అంశాలపై సమీక్ష సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ సి ల కై వివిధ శాఖల ద్వారా అమలు చేస్తున్న సబ్ ప్లాన్ నిధులు పక్కాగా వినియోగించాలని,దారి మళ్లించవద్దని, ఒకవేళ దారి మళ్ళి ఇస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు . జిల్లాలో ఎస్సీ, ఎస్టీల పై దాడులకు సంబంధించి కోర్టు కేసులు జాప్యం లేకుండా పరిష్కరించాలని , శిక్షల శాతాన్ని పెంచాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ ను ఆదేశించారు. జిల్లాలో ఎస్సీ ఎస్టీ దాడుల కేసుల్లో బాధితులకు అందించాల్సిన కోటి 89 లక్షల రూపాయల పరిహారాన్ని సాధ్యమైనంత త్వరగా తెప్పించేందుకు ప్రయత్నిస్తామని, అలాగే కులాంతర వివాహాలు చేసుకున్న వారికి, బెస్ట్ అవైలబుల్ పాఠశాలలకు నిధులు తెప్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు . రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు జిల్లా శంకర్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ ,ఎస్టీ ల పై దాడుల కేసుల పరిష్కారం, డ్రగ్స్ అరికట్టడంలో పోలీసు, రెవెన్యూ శాఖలు చేస్తున్న కృషిని ప్రశంసించారు.నల్గొండ బైపాస్‌లో ఉన్న మహాత్ముల విగ్రహాలను అక్కడినుండి కదిలించవద్దని, ఎస్సీ, ఎస్టీల పై దాడుల కేసులకు సంబంధించిన అడ్వకేట్ దర్శన్ కు గన్మెన్ రక్షణ కల్పించాలని, మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం అవుట్సోర్సింగ్ ఉద్యోగాల నియామకానికి సంబంధించిన అంశంపై విచారణ నిర్వహించి నివేదిక సమర్పించాలన్నారు. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ జిల్లాలో షెడ్యూల్డ్ కులాలు, తెగల వారి పై దాడులకు సంబంధించి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నామని, ఇందులో భాగంగా జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేసి రెండుసార్లు సమావేశాలు నిర్వహించామని, రెవిన్యూ ,పోలీస్ తరపున ఎలాంటి ఇబ్బంది లేకుండా ఎస్సీ, ఎస్టీల కేసులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి, సంక్షేమంలో భాగంగా నల్గొండ జిల్లాలో జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ ఏర్పాటుతోపాటు ,నిరంతర సమీక్షలు, దాడులలో బాధితులకు నష్టపరిహారం ఇప్పించడం, క్రమం తప్పకుండా పౌర హక్కుల దినం నిర్వహించడం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాంబాబు నాయక్, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు సుంకు ధనలక్ష్మి, బెజ్జం సైదులు, మరో సభ్యులు అనిత, భీమనపల్లి సైదులు, భాస్కర్, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు కే. లక్ష్మీనారాయణ, కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమకరణ్ రెడ్డి, శిక్షణ సహాయ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి ,సాంఘిక సంక్షేమ శాఖ డిడి శశికళ, డిటిడిఓ కమలాకర్ ,డి.ఎఫ్.ఓ రాజశేఖర్, డిఆర్ఓ దశరథ్, ఆర్డీవోలు,డిఎస్పీలు, పాల్గొన్నారు.అంతకుముందు జిల్లాలో ఎస్సీ, ఎస్టీల సమీక్ష కోసం జిల్లా చేరుకున్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సభ్యులకు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పుష్పగుచ్ఛలను అందజేసి ఘన స్వాగతం పలికారు.

# పోలీసు ఉద్యోగార్థులకు ఉచిత రెసిడెన్షియల్ కోచింగ్

*** జిల్లాలో 139 పోలీసు పోస్టులు.. 15న ప్రవేశ పరీక్ష**

*** పేద, గ్రామీణ, గిరిజన యువత సద్వినియోగం చేసుకోవాలి: ఎస్పీ నితికా పంత్**



కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా,ప్రజాస్ఫూర్తి:పోలీసు ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న జిల్లా యువతకు జిల్లా పోలీసు శాఖ శుభవార్త అందించింది. రాష్ట్ర ప్రభుత్వం పోలీసు శాఖ, ఎస్పీఎఫ్, జైళ్ల శాఖ తదితర విభాగాల్లో 7,437 ఉద్యోగాల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో ఉచిత రెసిడెన్షియల్ పోలీసు రిక్రూట్‌మెంట్ కోచింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ నితికా పంత్, తెలిపారు.జిల్లాలో మొత్తం 139 పోలీసు పోస్టులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. వీటిలో సివిల్ కానిస్టేబుల్ 87, ఏఆర్ కానిస్టేబుల్ 40, ఫైర్ ఫైటర్స్ 9, జైల్ వార్డర్ 3 పోస్టులు ఉన్నాయని వివరించారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఇంటర్మీడియట్ విద్యార్హత కలిగి ఉండాలని తెలిపారు.

**ఉచిత వసతి, శిక్షణ...**

పోలీసు ఉద్యోగాలకు ఎంపికయ్యేలా యువతను తీర్చిదిద్దేందుకు అనుభవజ్ఞులైన అధ్యాపకులు, అర్హత కలిగిన ఫిజికల్ ట్రైనర్లతో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు ఎస్పీ తెలిపారు. శిక్షణలో భాగంగా ఉచిత వసతి, తరగతి బోధన, శారీరక శిక్షణతో పాటు అవసరమైన ఇతర సౌకర్యాలు కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని పేద, గ్రామీణ, గిరిజన, మారుమూల ప్రాంతాల యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పోలీసు ఉద్యోగం సాధించేందుకు కృషి చేయాలని ఎస్పీ సూచించారు.

**15న ప్రవేశ పరీక్ష...**

పోలీసు శాఖలో ఉద్యోగం సాధించాలనే ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ సమీప పోలీస్‌స్టేషన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పేర్లు నమోదు చేసుకున్న అభ్యర్థులకు ఆగస్టు 15న ప్రవేశ పరీక్ష నిర్వహించి, అందులో ప్రతిభ కనబరిచిన వారిని ఉచిత రెసిడెన్షియల్ కోచింగ్‌కు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు కోచింగ్ ప్రారంభ తేదీ, శిక్షణా స్థలం, ఇతర పూర్తి వివరాలను తరువాత

# నకిలీ ధృవపత్రాలతో ఉద్యోగ పదోన్నతి పొందుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి

*** జాతీయ అందుల సమైక్య రాష్ట్ర శాఖ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్ గౌడ్**




జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి : దివ్యాంగుల రిజర్వేషన్ల నకిలీ ధృవపత్రాలతో ఉద్యోగ పదోన్నతి పొందుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జాతీయ అందుల సమైక్య రాష్ట్ర శాఖ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. సాయిబాబా నగర్ డివిజన్ సూరారం కాలనీ లూయిస్ బ్రెయిలీ భవన్ బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రవీణ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఇటీవల సంగారెడ్డి జిల్లా కంది మండలంలో దృష్టి లోపం రిజర్వేషన్ ద్వారా పదోన్నతి పొందిన ఉద్యోగి ధ్రువపత్రంపై అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి నిజానిజాలు తేల్చాలన్నారు. వైద్య పరీక్షల్లో 30% దృష్టి లోపం మాత్రమే ఉన్నట్లు తేలినట్లు సమాచారం ఉన్నప్పటికీ, సంబంధిత ఉద్యోగి తిరిగి అదే పోస్టులో కొనసాగడం పట్ల జాతీయ అంధుల సమాఖ్య, తెలంగాణ శాఖ ఆందోళన వ్యక్తం చేసిందన్నారు. కొంతమంది వక్రమార్గంలో వెళ్లి పదోన్నతులు పొందుతున్నారని దీంతో నిజమైన దివ్యాంగుల రిజర్వేషన్ హక్కులకు అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటివి రాష్ట్రంలో చాలా జరుగుతున్నాయని బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జాతీయ అంధుల సమాఖ్య తెలంగాణ శాఖ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ అంధుల సమైక్య, తెలంగాణ శాఖ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్ గౌడ్, అంజయ్య గౌడ్, ఎస్. రవీందర్, యు. అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎస్.ఐ.ఆర్. ప్రక్రియలో తదుపరి దశకు సన్నద్ధం కావాలి

*** జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**




ప్రజాస్ఫూర్తి, ఖమ్మం జిల్లా : స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ఖమ్మం జిల్లాలో తొలి దశను విజయవంతంగా పూర్తి చేశామని, ఎస్ఐఆర్ ప్రక్రియలో సహకరించిన ప్రజలు, బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు), అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, మీడియా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ ఎస్.ఐ.ఆర్. తదుపరి దశకు సన్నద్ధం కావాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్ఐఆర్ ప్రక్రియపై మీడియాతో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఎస్ఐఆర్ షెడ్యూల్‌ను రెండు పర్యాయాలు పొడిగించిందని తెలిపారు. ప్రస్తుతం తొలి దశ ప్రక్రియ పూర్తయిందని, తదుపరి దశకు జిల్లా యంత్రాంగం సన్నద్ధంగా ఉందని చెప్పారు. ఆగస్టు 17న ముసాయిదా ఓటరు జాబితాను ప్రచురించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 16 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలను స్వీకరిస్తామని, ఆగస్టు 17 నుంచి అక్టోబర్ 15 వరకు వాటిని పరిష్కరిస్తామని చెప్పారు. అక్టోబర్ 19న తుది ఓటరు జాబితాను ప్రచురించనున్నట్లు వెల్లడించారు.

*** 10 లక్షల 85 వేల 927 ఎన్యూమరేషన్ ఫారాలు డిజిటలైజేషన్**

ఖమ్మం జిల్లాలో మొత్తం 10,85,927 ఎన్యూమరేషన్ ఫారాలు (87.31 శాతం) మేర డిజిటలైజేషన్ పూర్తయిందని తెలిపారు. సేకరించిన ఫారాల్లో 43,131 మంది మ్యాపింగ్ చేయబడలేదని, వీరికి నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేస్తామని చెప్పారు. నోటీసులు అందుకున్న వారు ఎన్నికల సంఘం సూచించిన 11 రకాల ధృవపత్రాల్లో నిబంధనలకు అనుగుణంగా తగిన ధృవపత్రాన్ని సమర్పించాలని కలెక్టర్ సూచించారు. అవసరమైన ధృవపత్రాలు అందుబాటులో లేని వారు దరఖాస్తు చేసుకోవాలని, వారికి అవసరమైన ధృవ పత్రాలను వీలైనంత త్వరగా అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

*** ఎస్.ఐ.ఆర్. డేటాలో 1,32,736 అనామలీస్ గుర్తింపు**

జిల్లాలో 1,32,736 అనామలీస్ గుర్తించినట్లు కలెక్టర్ తెలిపారు. ఇది మొత్తం ఫారాల్లో 10.67 శాతం అని చెప్పారు. పేర్ల స్పెల్లింగ్‌లో తేడాలు, తల్లిదండ్రులు-పిల్లల మధ్య వయస్సు వ్యత్యాసం 15 సంవత్సరాల కంటే తక్కువగా ఉండటం తదితర కారణాలతో అనామలీస్ గుర్తించినట్లు తెలిపారు. వీటిని కేవలం డేటాలోని లోపాలుగా పరిగణించకుండా, క్షేత్ర స్థాయిలో విచారణ నిర్వహించి వాస్తవాలను నిర్ధారించిన అనంతరం అవసరమైన సవరణలు చేపడతామని తెలిపారు.

*** 1,57,854 మంది ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించలేదు**

జిల్లాలో 1,57,854 మంది ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారాలను తిరిగి సమర్పించలేదని కలెక్టర్ తెలిపారు. వీరిపై క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించామని చెప్పారు. క్షేత్రస్థాయి విచారణలో 33,380 మంది మరణించిన ఓటర్లు, 11,004 మంది డబుల్ ఓటర్లు, సుమారు 1,01,000 మంది శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలివెళ్లిన ఓటర్లు ఉన్నట్లు గుర్తించామని తెలిపారు.

*** ఫారం సమర్పించని అర్హులైన ఓటర్లకు మరో అవకాశం**

ఎన్యూమరేషన్ ఫారం సమర్పించని అర్హులైన ఓటర్లకు ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 16 వరకు మరో అవకాశం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ఇతర ప్రాంతంలో తనకు ఓటు హక్కు లేదని ప్రకటిస్తూ అవసరమైన డిక్లరేషన్‌తో పాటు సంబంధిత వివరాలు, ధృవపత్రాలను సమర్పించవచ్చని చెప్పారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.అదేవిధంగా కొత్తగా ఓటరుగా నమోదు కావాలనుకునే అర్హులైన పౌరులు ఫారం6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పుట్టిన తేదీకి అనుగుణంగా ఎన్నికల సంఘం సూచించిన ధృవపత్రాలను సమర్పించాల్సి ఉంటుందని చెప్పారు.

*** నోటీసులు అందుకున్న వారు ఆధారాలను సమర్పించాలి**

*** జనన తేదీ ఆధారంగా ధృవపత్రాల సమర్పణ**

భారతదేశంలో 1987జులై 1కు ముందు జన్మించిన వారు తమ స్వీయ గుర్తింపు లేదా జనన పత్రాలు నిర్ధారించే ధృవ పత్రాల్లో ఏదైనా ఒకదాన్ని సమర్పించాల్సి ఉంటుందని, 1987 జూలై 1 నుంచి 2004 డిసెంబర్ 2 మధ్య జన్మించిన వారు తమ పత్రాలతో పాటు తల్లిదండ్రులలో ఎవరిదైనా ఒకరి ధృవ పత్రాన్ని సమర్పించాల్సి ఉంటుందని, 2004 డిసెంబర్ 2 తర్వాత జన్మించిన వారు తమ పత్రాలతో పాటు తల్లిదండ్రులిద్దరి పత్రాలు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. ఎన్నికల సంఘం సూచించిన 11 రకాల ధృవ పత్రాలలో నిబంధనలకు అనుగుణంగా ఏదైనా ఒకదాన్ని సమర్పించవచ్చని కలెక్టర్ తెలిపారు.

*** క్లెయిమ్స్, అభ్యంతరాలపై విచారణ అనంతరం నిర్ణయం**

ఈఆర్ఓలు తీసుకున్న నిర్ణయంపై నిబంధనల ప్రకారం అక్టోబర్ 15 వరకు అప్పీల్ చేసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. ప్రజలు తమకు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఓటరు జాబితాలో తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

# మధుర పరిమళాల మనోహరం!

**ప్రకృతి ఒడిలో వికసించే పూలలో కొన్ని కేవలం అందాన్ని ఇస్తే, మరికొన్ని మధురమైన సుగంధాన్ని వెదజల్లుతాయి. కానీ, ఈ రెండింటినీ రంగరించుకున్న అద్భుతమైన తీగ మొక్క 'హనీసకల్'.**







హనీసకల్ అనగానే మనకు గుర్తొచ్చేది దాని విలక్షణమైన పూల ఆకారం. గొట్టం ఆకారంలో ఉండే ఈ పూలు గుత్తులు గుత్తులుగా పూస్తాయి. ఈ పూల అడుగు భాగంలో ఉండే మకరందం అత్యంత తీపిగా ఉండటం వల్ల దీనికి 'హనీసకల్' అనే పేరు వచ్చింది. పూలు... తెలుపు, పసుపు, ఎరుపు, పింక్ నారింజ రంగులలో విచ్చుకుంటాయి. ఈ పూల తీపి వాసన సీతాకోకచిలుకలను, తేనెటీగలను హమ్మింగ్ బర్డ్స్‌ను ఆకర్షిస్తుంది. సువాసనలు వెదజల్లే ఈ పూలలో కొన్ని రకాలు... సాయంత్రం వేళల్లో మరింత గాఢమైన సుగంధాన్ని విడుదల చేస్తాయి. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 180 రకాల జాతుల్ని కలిగిన హనీసకల్ మొక్కది వేల ఏళ్ల చరిత్ర. ప్రాచీన చైనా వైద్య శాస్త్రంలో దీన్ని కీలకంగా వాడతారు. ముఖ్యంగా శరీరాన్ని చల్లబరచడానికీ, విష పదార్థాలను బయటకు పంపడానికీ ఉపయోగిస్తారట. బ్రిటన్‌లో విక్టోరియన్ కాలంలో ఈ పూలను ప్రేమకు, విశ్వాసానికి చిహ్నంగా, పెళ్లిలో వధువు ఈ పూలను పెట్టుకోవడం శుభసూచకంగానూ భావించేవారట. అందుకేనేమో... షేక్స్‌పియర్ వంటి ప్రముఖ కవుల రచనల్లో ఈ పూల ప్రస్తావన ఎక్కువగా కనిపిస్తుంది.

**తేమ అవసరమే కానీ...**

ఈ మొక్కకు రోజుకు కనీసం 6 నుంచి 8 గంటల పాటు ఎండ అవసరం. ఎండ తక్కువైతే పూలు తక్కువగా పూస్తాయి. నీరు నిల్వ ఉండని సారవంతమైన నేలలు దీనికి అనుకూలం. ఇవి తీగ జాతి మొక్కలు కాబట్టి, పాకడానికి గోడలు, ఫెన్సింగ్ లేదా ట్రెల్లిస్ వంటి ఆధారాల్ని కల్పించాలి. మొక్క నాటిన కొత్తలో క్రమం తప్పకుండా నీరు పెట్టాలి. ఎదిగిన తర్వాత నేల పైపొర ఆరిపోయినప్పుడు మాత్రమే నీరు పోయాలి. వేర్ల దగ్గర తేమ ఉండాలి కానీ నీరు నిలిచిపోకూడదు. శీతకాలం చివరలో లేదా వసంతకాలం మొదట్లో మొక్కను కత్తిరించాలి. ఎండిపోయిన





కొమ్మలను తొలగించడం వల్ల కొత్త చిగుళ్లు వచ్చి పూలు ఎక్కువగా పూస్తాయి. ఏడాదికి రెండుసార్లు కంపోస్ట్ లేదా స్లోరిలీజింగ్ ఫెర్టిలైజర్లను అందించాలి. ఈ మొక్కకు పిండి నల్లి, తెల్లదోమ, బూజు తెగులు వంటివి వచ్చే అవకాశం ఉంది. వీటిని దూరం చేయడానికి ఫంగిసైడ్‌తో పాటు వేపనూనె పిచికారీ చేయవచ్చు. దానికంటే ముందుగా వ్యాధిసోకిన కొమ్మలు, ఆకులను కత్తిరించి దూరంగా పారేయడం మంచిది. ఈ జాగ్రత్తలతో మొక్క ఆరోగ్యంగా నిండుగా పూస్తుంది.

# చెమట పడితే మంచిదేనట!


**వేసవిలో వేడికి తట్టుకోలేక శరీరం చెమటలు పట్టడం సహజమే! అయితే ఇలా చెమటలు రావడం వల్ల చిరాగ్గా, అసౌకర్యంగా అనిపిస్తుంటుంది. దీంతో ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లను ఆశ్రయిస్తుంటాం. నిజానికి శరీరం నుంచి చెమట బయటికి రాకుండా ఎప్పుడూ ఇలా చల్లటి వాతావరణంలో గడపడం కంటే.. కాస్త చెమట పట్టనివ్వడమే ఆరోగ్యకరం అంటున్నారు నిపుణులు. మరి, అదెలాగో తెలుసుకుందాం రండి..**

వడదెబ్బ తగలకుండా..!

ఎండాకాలంలో కాసేపు బయట గడిపినా, అధిక ఉష్ణోగ్రతల ప్రభావం వల్ల వడదెబ్బ తగులుతుంటుంది. అయితే చెమటలు పట్టడం వల్ల వడదెబ్బ నుంచి కొంతవరకు రక్షణ పొందచ్చంటున్నారు నిపుణులు. అదెలాగంటే.. చెమట మన శరీరానికి సహజసిద్ధమైన కూలింగ్ ఏజెంట్‌లా పనిచేస్తుంది. ఎండ వేడి శరీరంలోకి వెళ్లకుండా చెమట అడ్డుపడుతుంది. తద్వారా శరీరంలో ఉష్ణోగ్రతలు పెరగకుండా జాగ్రత్తపడచ్చు. ఇక ఈ కాలంలో వడదెబ్బ నుంచి రక్షణ పొందాలంటే.. ద్రవాహారం ఎక్కువగా తీసుకోవడం, శరీరానికి చలువ చేసే పదార్థాల్ని తీసుకోవడమూ ముఖ్యమే అంటున్నారు నిపుణులు.

**రోగనిరోధక శక్తికి!**

స్వేద గ్రంథులు విడుదల చేసే చెమట



రోగనిరోధక శక్తినీ పెంచుతుందని ఓ అధ్యయనంలో తేలింది. ఇందుకు స్వేద గ్రంథుల్లో ఉండే యాంటీమైక్రోబియల్ పెప్టైడ్లే కారణమట! ఇవి వ్యాధులకు కారణమయ్యే క్రిములతో పోరాడి.. సహజ రక్షణ కల్పిస్తాయి అంటున్నారు నిపుణులు.

**ఇవి కూడా!**

* వ్యాయామం చేసే క్రమంలో చెమట పడుతుంది. తద్వారా శరీరం చల్లబడడంతో పాటు ఎండార్ఫిన్లూ విడుదలవుతాయి. ఫలితంగా శారీరక నొప్పులు, ఒత్తిళ్లు తగ్గి ప్రశాంతంగా ఉండచ్చు అంటున్నారు నిపుణులు.
* శరీరం చెమట పట్టినప్పుడు చర్మ గ్రంథులు తెరుచుకుంటాయి. తద్వారా చర్మ రంధ్రాల్లో గాలి బాగా ఆడుతుంది. అలాగే శరీరంలోని మలినాలూ చెమట రూపంలో బయటికి వచ్చేస్తాయి. వీటివల్ల చర్మం ఎప్పటికప్పుడు శుభ్రపడుతుందట.

గమనిక : అయితే ఇలా చెమట పట్టడం మంచిదే అయినా.. ఎక్కువసేపు ఇలాగే ఉండడం వల్ల చర్మ ఆరోగ్యం దెబ్బతింటుంది. వాతావరణంలోని దుమ్ముధూళి చెమటతో కలిసి చర్మ రంధ్రాల్లోకి చేరడం వల్ల మొటిమలు, మచ్చలు ఏర్పడతాయి. కాబట్టి చెమట పట్టిన వెంటనే స్నానం చేయడం మంచిదంటున్నారు నిపుణులు.

# వేసవి తాపాన్ని తగ్గించే జల్ జీరా!

ఎండా కాలం వచ్చిందంటే చాలు దాహంతో అల్లాడిపోతుంటాం. ఈ సమయంలో కృత్రిమమైన కూల్ డ్రింక్స్, సోడాలను తాగే బదులు ఓ గ్లాస్ జల్ జీరా తాగి చూడండి. ఇది దాహం తీర్చడమే కాదు... మరెన్నో ఆరోగ్య ప్రయోజనాలనూ అందిస్తుంది. ముఖ్యంగా ఇందులోని జీలకర్ర జీర్ణ రసాల ఉత్పత్తిని ప్రేరేపిస్తుంది. గ్యాస్, ఎసిడిటీ, కడుపు ఉబ్బరం వంటి సమస్యలను తగ్గిస్తుంది. దీన్ని క్రమం తప్పకుండా తీసుకుంటే శరీరానికి అవసరమైన ఇనుమూ అందుతుంది. పీరియడ్స్ సమయంలో వచ్చే పొత్తికడుపు నొప్పి, తిమ్మిర్ల నుంచి ఈ పానీయం ఉపశమనం కలిగిస్తుంది. ఇక, ఇందులోని నల్ల ఉప్పు... శరీరానికి అవసరమైన ఎలక్ట్రోలైట్లను అందిస్తుంది. అందుకే, ఎండలో తిరిగి ఇంటికి రాగానే ఒక గ్లాసు జల్ జీరా తాగి చూడండి. ఆ అలసట తక్షణమే మాయమవుతుంది. వేయించిన జీలకర్ర, కొద్దిగా అల్లం ముక్క, పుదీనా ఆకులు, పచ్చిమిర్చి (అవసరమైతే) కలిపి మెత్తగా రుబ్బాలి. ఈ మిశ్రమాన్ని చల్లని నీటిలో కలిపి, తగినంత నల్ల ఉప్పు, ఆమ్‌చూర్ పొడి, నిమ్మరసం కలపాలి. చివరగా కొద్దిగా బూందీ చల్లుకుంటే సరి. రుచికరమైన జల్ జీరా తయారైనట్లే. సహజ సిద్ధమైన ఈ పానీయం పెయిన్ కిల్లర్‌లానూ పనిచేస్తుంది. జీవక్రియను మెరుగుపరుస్తుంది. ముఖ్యంగా తక్కువ కెలొరీలు ఉండి, ఆకలిని నియంత్రించడంలో సహాయపడటం వల్ల బరువు తగ్గాలనుకునే మహిళలకు మంచి ఎంపిక.





# ఇలా... ప్రకృతికి చేరువగా!

**అపార్ట్‌మెంట్లలో ప్రతి చదరపు అడుగూ విలువైనదే. ఆయా గదుల్ని వినియోగం పరంగా ప్రత్యేకంగా మార్పులు చేసుకోలేం కానీ, బాల్కనీ అందుకు మినహాయింపు. అందుకే దీన్ని ఎలా తీర్చిదిద్దుతున్నామనేది ముఖ్యం. ప్రకృతికీ, పచ్చదనానికీ చేరువయ్యేందుకు ఇదో దగ్గర మార్గం. అందుకోసం ఏం చేయాలంటే...**

కాసేపు ఎండ పట్టడం, తీరిగ్గా కూర్చొని కప్పు కాఫీ తాగడం, ధ్యానం చేసుకోవడం... అన్నింటికీ ఒకటే చోటు... బాల్కనీ. చూశారా ఇది ఎంత ముఖ్యమైందో! అందుకే దీన్ని చిన్నపాటి పార్కుగా మార్చేయాలి. అప్పుడే ప్రకృతిలోకి వెళ్లాలనుకున్నప్పుడల్లా అక్కడ కాసేపు కూర్చొని సేదతీరొచ్చు.

* నిలువుగా పెరిగే మొక్కలకు ప్రాధాన్యం ఇవ్వండి. అవి పాకేందుకు వీలుగా ఏర్పాట్లుచేయాలి. ఇవి గాలిని శుద్ధి చేస్తాయి. అలాగే ఎండ నుంచి ఉపశమనం కలిగిస్తాయి.
* తరచూ మార్చాల్సిన పనిలేకుండా ఎండలూ, వర్షాలకు తట్టుకునే మెటీరియల్‌ని అక్కడ ఉపయోగించాలి. అందుకు గట్టి కుండీలు, మెటల్‌తో చేసిన వస్తువులు ఎంచుకోవడం మేలు.
* ఇన్విజబుల్ నెట్టింగ్ బార్‌ని ఉపయోగించి పావురాలను దూరం పెట్టండి. అక్కడ కూర్చునేందుకు ప్రత్యేకంగా చిన్న సైజు కుర్చీల్ని వినియోగించండి.
* చీకటిపడ్డాక పెద్ద లైట్లు కాకుండా చిన్న సోలార్ లాంతర్లు వాడండి. వాటిని మొక్కల మధ్యన ఉంచితే ఇంకా మంచిది.

